

వైసీపీకి.. పచ్చధనం

ఆహ్లాదం పంచాల్సిన చెట్లు.. మొక్కలు వైసీపీ నేతలకు కాసులు కురిపించాయి. సాధారణంగా ముఖ్యమంత్రిగా జగన్ ఎక్కడికైనా వస్తున్నాడంటే ఆ ప్రాంతంలో పెద్దపెద్ద వృక్షాలు కొట్టాల్సిందే. అలా కొట్టిన చెట్లు వైసీపీ నేతలు అమ్మేసుకుని సొమ్ము చేసుకు నే వారు. అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఐదేళ్లలో జరిగిన ముఖ్యమంత్రి సభా ప్రాంగణాల అలంకరణకు పెద్దఎత్తు న మొక్కలు కొనుగోలు చేసేవారు. ఆ తర్వాత ఆ మొక్కలను కూడా అమ్మేసుకుని సొమ్ములు జేబుల్లో వేసుకునే వారు. ఇలా వైసీపీ హయాంలో కొట్టేసిన చెట్లు.. సభాలంకరణలకు కొనుగోలు చేసిన మొక్కలు కాసులు కురిపించాయి. అధికారులు, నేతలు ఎక్కడికక్కడ కుమ్మక్కై పచ్చధనంతో జేబులు నింపుకునేవారు. ఇసుక నుంచి తైలం తీయడం కష్టమేమో కానీ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేని నుంచైనా కాసులు కురిపించొచ్చనేది నిరూపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఘరానా దోపిడీ సంఘటనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వీటిలో కొన్ని సంఘటనలు చూస్తే ఈ రూపం లోనూ దోచుకో వచ్చా! అన్న ఆశ్చర్యం కలగక మానదు. అటువంటి వాటిలోదే మొక్కల కొనుగోళ్లు, అమ్మకాల కోణం.





- జగన్ సభలకు మొక్కల పేరిట దోపిడీ
- చెట్లు కొట్టినా.. మొక్కలు కొన్నా కాసులే కాసులు
- వైసీపీ నేతలు, మున్సిపల్ సిబ్బంది కుమ్మక్కు
- పట్టణాల సుందరీకరణ మొక్కలూ అమ్మకాలు
- కూటమి ప్రభుత్వంలోనూ మున్సిపాల్టీల్లో అక్రమాలు
- పట్టణ పార్కుల్లో నాటాల్సిన మొక్కలు కూడా మాయం



యార్డు కార్యాలయం ఎదుటే నరికిన భారీ వృక్షం



మార్కెట్ యార్డు ప్రధాన గేటు పక్కనే నరికిన భారీ వృక్షం

తెనాలి, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): గత వైసీపీ హయాంలో మహా వృక్షాలపై గొడ్డలి వేటు పడిందంటే, చెట్లు నేలకొరిగాయంటే ఒక్కటే గుర్తు.. అక్కడికి జగనన్న వస్తున్నాడని. ఇది జనానికి తెలిసిన ఒకవైపు కోణమే. మరో కోణంలో.. జగన్ వస్తున్నాడంటే రూ.లక్షల విలువైన మొక్కలనూ కొనుగోలు చేసేవారు. రోడ్ల వెంట మహా వృక్షాలు నేలవాలి, పచ్చదనం మాయమై మోడువారినా పర్వాలేదు కానీ, జగన్ పాల్గొనే ప్రాంతం పచ్చగా కనిపించాలట. దీనిని అడ్డుపెట్టుకుని కొందరు నేతలు, మున్సిపల్ సిబ్బంది లెక్కలేనంత ప్రజాధనాన్ని దోచేశారు. చెట్లు.. మొక్కలు.. ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతాయని అందరికీ తెలుసు. కానీ కాసులు కూడా కురిపిస్తాయని, మొక్కల మాటున రూ.కోట్లు వెనకేయవచ్చని వైసీపీ నేతలు నిరూపించారు. తాడేపల్లి ప్యాలస్ నుంచి జగన్ బయటకు అడుగుపెడితే పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేయించేవారు. అదే సమయంలో (మిగతా 8వ పేజీలో..)



భారీ క్రేన్‌లు, కోత యంత్రాలతో మనుషులనుపెట్టి నరికేస్తున్న మహా వృక్షాలు



ఇంతటి భారీ మొద్దులతో తరలిపోయిన లారీలు.. ఇటువంటి కలపనే టన్ను రూ.1100కి కట్టబెట్టేశారు



అద్దంకిలో గత ఏడాది నకిలీ పాల తయారీకి ఉపయోగించిన వస్తువులు (ఫైల్)



నకిలీ పాలతో ఉన్న క్యాన్‌లు

గుట్టుగా నకిలీ పాల తయారీ

- చిన్నారులు, వృద్ధుల ప్రాణాలతో చెలగాటం
- పలు చోట్ల కుటీర పరిశ్రమ.. పట్టించుకోని అధికారులు

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలలో నీళ్ల కలపడం సర్వసాధారణం. దీనివల్ల పాల ఉత్పత్తిదారులకు లాభం వచ్చినా, వినియోగదారులకు నష్టం కలిగినా, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. కానీ ఇటీవల కొందరు ఏకంగా పాలనే తయారు చేస్తున్నారు. ఈ పాలు ప్రాణాంతకంగా మారుతున్నా అడ్డగోలు ఆదాయం కోసం కొందరు దీనిని ఓ కుటీర పరిశ్రమగా మార్చేసుకున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో పలు మండలాల్లో పాలసేకరణ కేంద్రాల నిర్వహకులు నకిలీ పాల ఉత్పత్తి చేసి సేకరించిన పాలలో కలిపి డెయిరీలకు సరఫరా చేసే వారు. ఇది గమనించిన పలువురు రైతులు అదే దారిలో నడిచి ఏకంగా ఇళ్లలోనే నకిలీ పాల ఉత్పత్తి ప్రారంభించారు. దీంతో పలు గ్రామాల్లో గేదెల పాల కంటే నకిలీ పాలే ఎక్కువయ్యాయి. డెయిరీల నిర్వాహకులు గుర్తించి ఆయా గ్రామాల నుంచి వచ్చే పాలను నిలిపివేస్తున్నారు. చిన్న చిన్న పాల డెయిరీల నిర్వాహకులు తమకు సరిపడా పాలసేకరణ జరగకపోవడంతో నకిలీ పాలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో పలువురు రైతులతో పాటు కొందరు యువకులు అదే వృత్తిగా మార్చుకుని నకిలీ పాలను ఉత్పత్తి చేస్తున్నారు. అద్దంకిలో గత ఏడాది పెద్దఎత్తున నకిలీ పాల ఉత్పత్తి సామగ్రి పెద్దఎత్తున పట్టుబడింది. దర్శి ముండ్లమూరు, తాళ్లూరు ప్రాంతాలలో కూడా పెద్దఎత్తున నకిలీ పాల ఉత్పత్తి రాకెట్ గుట్టురట్టయింది. కొద్దిరోజులు ఈ నకిలీ పాల తయారీ ఆగినా వారే స్థావరాలు మార్చి ఉత్పత్తి చేస్తున్నట్లు తెలుస్తుంది. అద్దంకి, దర్శి పట్టణ శివారు ప్రాంతాల్లో కొందరు యువకులు నకిలీ పాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. పామాయిల్, యూరియా, చక్కెర, పాలపొడిని పాల తయారీకి వినియోగిస్తున్నారు. ఈ పాలు ప్రజల ఆరోగ్యం పై ప్రభావం చూపించే అవకాశం ఉందని వైద్యులు చెప్తున్నారు. ఆయా శాఖల అధికారులు నిఘా పెంచి కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.



మంత్రి రవికుమార్‌తో వైసీపీ హయాంలో పింఛన్ నిలిపివేశారని చెప్తున్న అంధుడు

పంచాయతీల బలోపేతమే ధ్యేయం

- వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని పల్లెలు
- ఎందుకు గెలిచామా అని బాధపడిన సర్పంచ్‌లు
- జిల్లాలో రూ.150 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- మోదేపల్లిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు నిధులు కేటాయించి బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలం మోదేపల్లిలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లకు మంత్రి గొట్టిపాటి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు కేంద్రం నుంచి విడుదలైన నిధులతో పాటు స్థానిక నిధులను కూడా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పక్కదారి పట్టిందన్నారు. నాటి ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టకుండా పల్లెల్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఎన్నికైన వైసీపీ సర్పంచ్‌లు సైతం ఎందుకు గెలిచామా అని బాధపడ్డారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని గ్రామ పంచాయతీలలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, ఇతర పనులు ప్రారంభించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్లతో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

లొకేషన్ల లొల్లి

- రద్దీ ప్రదేశాల్లో షాపుల కోసం పోటీ
- పలు చోట్ల నేతలతో మద్యం వ్యాపారుల ఒత్తిళ్లు
- 30 వరకు గడువు ఉండడంతో ప్రైమ్ లోకేషన్ కోసం పట్టు

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల దరఖాస్తులు చేసేటప్పుడు సిండికేట్ బెదిరింపులు.. లైసెన్సు ఘట్టం ముగిశాక భాగస్వామ్యం కోసం పట్టు.. ఇప్పుడు మద్యం షాపులు ప్రారంభించే లోకేషన్ల కోసం తకరారు. ఇదీ బాపట్ల జిల్లాలో మద్యం దుకాణాల పరిస్థితి. మద్యం షాపులకు నోటిఫికేషన్ సమయంలోనే ఎక్సైజ్ శాఖ లోకేషన్‌ను నోటిఫై చేయలేదు. దీంతో షాపులు దక్కించుకున్న లైసెన్సుదారులు ఎవరికి వారు ప్రైమ్ లోకేషన్లలో షాపు పెట్టుకోవడానికి పోటీ పడుతున్నారు. రూరల్ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్‌లో ఈ రకమైన పోటీ ఎక్కువగా ఉంది. నిర్దేశిత ప్రాంతంలో లైసెన్సు దక్కించుకున్న వారు నిబంధనల ప్రకారం పక్కపక్కన షాపులు పెట్టుకున్నా తమకేం అభ్యంతరం లేదని ఎక్సైజ్ శాఖ తెలిపింది. దీంతో ఎవరికి వారు రద్దీ ఏరియాల్లోనే షాపు పెట్టుకోవడానికి ప్రయత్నాలు ఆరంభించారు. ఈ క్రమంలో కొన్ని చోట్ల రాజకీయ పరపతిని ఉపయోగించి పోటీకి వచ్చేవారిని కట్టడి చేసే కార్యక్రమం కూడా యథేచ్ఛగా జరుగుతోంది. ఇప్పటికే టెంపరరీగా షాపులు ప్రారంభించిన యజమానులు ఇంకా పది రోజులు గడువు ఉన్నందున ఈలోగా అమ్మకాలు ఎక్కువగా సాగే ప్రదేశం కోసం అన్వేషణ ప్రారంభించారు. ఇందుకు సంబంధించి పోటీకి వచ్చేవారిపై రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడానికి తెరవెనక మంతనాలు సాగిస్తున్నారు. ఈ నెల 30 తర్వాత మాత్రం వారు ఎక్సైజ్ శాఖకు అందించిన శాశ్వత ప్రదేశంలోనే అమ్మకాలు చేపట్టాలి. ఆ తర్వాత ఏవైనా కారణాల వల్ల షాపును మార్చుకోదలిస్తే ప్రభుత్వానికి అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా లక్షల్లోనే ఉండే అవకాశం ఉంది. దీంతో నిబంధనల ప్రకారం సరైన ప్రదేశం కోసం లైసెన్సుదారులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ మద్యం షాపులో గతంలో ఎంత అమ్మకాలు జరిగేవి అని కూడా ఆరా తీస్తున్నారు.

ఇక్కడ పెట్టడానికి వీల్లేదు..

బాపట్లకు చెందిన ఓ వ్యక్తి రూరల్ పరిధిలో మద్యం షాపు లైసెన్సు దక్కించుకున్నారు. అతడు అప్పికట్ల పరిధిలో షాపు పెట్టడానికి ప్రయత్నించగా సిండికేట్ అడ్డం తగిలినట్లు సమాచారం. అదేవిధంగా బాపట్ల పట్టణంలో మార్కెట్ సెంటర్‌లో కూడా ఇద్దరు వ్యాపారులు షాపు కోసం పట్టుబడుతున్నారు. అత్యంత రద్దీగా ఉండే చీలురోడ్డులో మద్యం దుకాణం పెట్టే విషయంలో రెండు గ్రూపుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. కర్లపాలెం పరిధిలో ఓ ప్రదేశంలో షాపు పెట్టే విషయంలో కూడా ఇదే రకమైన పోటీ నెలకొంది. రేపల్లె, చీరాలలో కూడా ప్రైమ్ లోకేషన్ల కోసం విపరీతమైన పోటీ నెలకొనడంతో పాటు ఎవరికి వారు మెట్టుదిగకపోవడంతో లోకేషన్ల లొల్లి మొదలైంది.

రూరల్‌లో దాదాపు అంతా సిండికేటే..

రూరల్ పరిధిలో షాపులు దక్కించుకున్న వారంతా సిండికేట్‌గా నడిపి లాభాలు పంచుకోవడానికి ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చారు. దీంతో రద్దీ ఏరియాల్లోనే మద్యం షాపు ప్రారంభించాలన్న పోటీకి ఆస్కారం లేకుండా పోయింది. పట్టణ ప్రాంతాల్లో కూడా ఈ రకమైన అవగాహనకు కొంతమంది ప్రయత్నించినా ఏకాభిప్రాయం రాలేదు. దీంతో ఎవరికి వారు లోకేషన్ విషయంలో పై చేయి సాధించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

98 షాపులు ప్రారంభం

జిల్లాలో ఉన్న 117 షాపులకు గురువారం నాటికి 98 షాపులు ప్రారంభమైనట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. మరో పది షాపులకు డిపోల్లో స్టాక్ కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందని అవి కూడా శుక్రవారానికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మరో 9 షాపుల విషయంలో ఇండెంట్ పెట్టడంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంలో జాప్యం జరిగిందన్నారు.



మార్టూరులోని షాపులో కొనసాగుతున్న మద్యం అమ్మకాలు

చెత్తసంపద కేంద్రాలకు
భూమిని సేకరించాలి

- నాలుగు పట్టణాల్లో 9 ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో చెత్తసంపద కేంద్రాలకు అవసరమైన భూమిని సేకరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. చెత్తసంపద కేంద్రాల ఏర్పాటుపై గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో నాలుగు పట్టణాల్లో 9 ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాపట్ల, చీరాల మున్సిపాలిటీల్లో ఒక్కొక్క ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి ఉందని చెప్పారు. మిగిలిన ఏడు కేంద్రాలకు 14.82 ఎకరాల భూమి అవసరమన్నారు. బాపట్లలో 2 ప్లాంట్లకు 3.50 ఎకరాలు, చీరాలలో ఒక ప్లాంట్‌కు 2 ఎకరాలు, రేపల్లెలో 2 ప్లాంట్లకు 4.89 ఎకరాలు, అద్దంకిలో 2 ప్లాంట్లకు 4.50 ఎకరాలు భూమి సేకరించాలన్నారు. చెత్తసంపద కేంద్రాల ఏర్పాటుతో కాలుష్యాన్ని నియంత్రించగలమని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, బాపట్ల కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

భూ ప్రక్షాళన

- రీసర్వే అవకతవకలపై ప్రభుత్వం దృష్టి
- ఫిర్యాదు అందిన 15 రోజుల్లోగా పరిష్కారం
- రీసర్వే పూర్తైన గ్రామాల్లో 22 నుంచి సదస్సులు

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగనన్న భూరక్ష పేరిట గత ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే వివాదస్పదమైన సంగతి తెలిసిందే. ఏళ్ల తరబడి రెవెన్యు తకరారులో ఉన్న భూములన్నింటికి రీసర్వేతో పరిష్కారం దొరుకుతుందని వైపీపీ గతంలో గొప్పగా ప్రకటించుకోగా క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరిగింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం జగనన్న భూరక్షను రద్దు చేసింది. రీసర్వేతో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించింది. వైసీపీ హయాంలో రీసర్వే ముగిసేసరికి రైతుల నుంచి ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు అందాయి. బాధితుల గోడును తొక్కిపెట్టి రీ సర్వే అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని నాటి పాలకులు ప్రకటించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రీసర్వే జరిగిన గ్రామాల్లో జరిగిన భూ అవకతవకలపై పెద్ద సంఖలో ఫిర్యాదులు అందాయి. వైసీపీ ప్రభుత్వం చేసిన భూ పాపాలను ప్రక్షాళన చేసి బాధితులకు న్యాయం చేయాలని ప్రస్తుత పాలకులు నిర్ణయించారు. రీ సర్వే పూర్తయిన జిల్లాలోని 71 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి భూ అవకతవకలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కార మార్గం చూపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 22 నుంచి గ్రామ సభలను నిర్వహించాలని ప్రణాళికలు రూపొందించింది. ఈ సభల్లో భూ హక్కుదారుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనుంది. నెల రోజుల పాటు రెవెన్యూ యంత్రాంగం వీటిని నిర్వహించేలా ప్రణాళిక చేపట్టారు. గ్రామ సభల్లో వచ్చిన ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించాలనే ఆదేశాలను కూడా కూటమి ప్రభుత్వం జారీ చేయడంతో బాధితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది

దాదాపు 500 వరకు ఫిర్యాదులు...

రీసర్వే పూర్తయ్యాక వైసీపీ ప్రభుత్వంలోనే ఆన్‌లైన్, స్పందన వేదికగా గ్రామాల నుంచి 500 వరకు ఫిర్యాదులు అందాయి. వాటికి అప్పట్లో పరిష్కారం దొరక్కపోగా వేర్వేరు కారణాలతో బాధితులనే మరింతగా క్షోభకు గురిచేసిన సందర్భాలు ఉన్నాయి. అవే ఫిర్యాదులు కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వివిధ వేదికల మీద అటు నేతలకు, ఇటు అధికారులకు అందుతూ వస్తున్నాయి. ఇలా వచ్చిన వాటిలో ఎక్కువగా రాజకీయ కారణాలతో భూమి విస్తీర్ణాన్ని తగ్గించి చూపెట్టారని కొందరు, చనిపోయిన వారిని హక్కుదారులుగా నమోదు చేశారని మరికొందరు ఫిర్యాదు చేశారు. గతంలో ఇలా వచ్చిన అభ్యంతరాల్లో ఎక్కువగా చీరాల, బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లోనే ఉన్నాయి. రీసర్వే పూర్తయిన బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలోని రైతు దాదాపు అరెకరం భూమిని రీసర్వేలో భాగంగా తనకు కాకుండా వేరే వారి హద్దుల్లో చూపించారని నెలల తరబడి అధికారులు చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని రీసర్వే పూర్తయిన ఓ గ్రామంలో ఏకంగా చనిపోయిన తమ పూర్వీకులను హక్కుదారులుగా పేర్కొన్నారని వాపోతున్నారు. వైసీపీ నేతల ఒత్తిళ్లతో చాలా చోట్ల అసలు రికార్డులే తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భూ బాగోతాలన్నీ 22 నుంచి జరిగే గ్రామ సభల్లో వెలుగులోకి రానున్నాయి.



రీసర్వేలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై...

వెలుగులోకి వచ్చిన బడాబాబుల అక్రమాలపై పెదవి విప్పకపోగా వారికి అండగా నిలబడింది. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన రీసర్వేలో భాగంగా దాదాపు 450 ఎకరాల అసైన్డ్ భూమి అన్యాక్రాంతమైనట్లు అప్పట్లో తేల్చారు. వీరందరికి అప్పటి జేసీ శ్రీనివాసులు నోటీసులు కూడా ఇచ్చారు. ఆ తర్వాత దానికి సంబంధించి ఒక్క అడుగు ముందుకు పడిన పాపాన పోలేదు. రాజకీయ పరమైన ఒత్తిళ్లతో వాటిని తెరమరుగు చేశారు. ప్రస్తుతం బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు రీసర్వేలో భాగంగా బహిర్గతమైన భూ అక్రమార్కులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి చర్యలకు దిగాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



విద్యార్థిని తేజస్వినిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

సీఎంఏ టాపర్‌కు సీఎం అభినందన

- సీఎం రిలీఫ్ ఫండ్‌కు

మాస్టర్‌మైండ్స్ రూ. 7 లక్షల విరాళం

గుంటూరు(విద్య),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్, విద్యార్థిని తండ్రి తదితరులు పాల్గొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను మాస్టర్‌మైండ్స్ సంస్థ తీర్చిదిద్దడం అభినందనీయమని చంద్రబాబు అన్నారు. ఇటీవల సంభవించిన వరదలకు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మాస్టర్‌మైండ్స్ తరపున సీఎం సహాయనిధికి రూ.7 లక్షలు డిడిని డైరెక్టర్ మోహన్ అందించారు.



నిజాంపట్నం హార్బర్‌లో 3వనెంబర్ ప్రమాద సూచిక

- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచిక ఎగురవేశారని పోర్టు కన్జర్వేటర్ మోకా వెంకటరామారావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్ళిన మత్స్యకారులు తిరిగి రావాలని, ఎవరూ వేటకు వెళ్లొద్దని సూచించారు.

అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు

- ముఖ్యమంత్రి ప్రకటనను తప్పుదారి పట్టిస్తున్నవైనం
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పెసర్లంక, గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తెనాలి, చెరుకుపల్లికి తరలింపు
- పోలీసుల తీరుపై విమర్శలు

కొల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సొంత అవసరాలకు ఇసుక ఉచితంగా తీసుకు వెళ్లవచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా పదులకు పైగా సంఖ్యలో ట్రాక్టర్లను కృష్ణానదిలో ఇసుక నింపుకుని రవాణా చేస్తూ విక్రయాలకు తెరలేపారు. గురువారం కొల్లూరు మండల పరిధిలోని పెసర్లంక, గాజుల్లంక వద్ద కృష్ణానదిలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక నింపుకుని తెనాలి, చెరుకుపల్లి తదితర ప్రాంతాలకు తరలించి వాహనదారులు సొమ్ము చేసుకునేందుకు ఉపక్రమించారు.

అయితే, వాగులు, వం కల్లో మాత్రమే ఉచితంగా సొంత అవసరాలకు ఇసుక తరలించుకోవచ్చని నదుల్లో మాత్రం నిబంధనలు వర్తిస్తాయని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా కేవలం ఉచిత ఇసుక నినాదాన్ని వినిపిస్తూ అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు ముఖ్యమంత్రి ప్రకటనను తప్పుదారి పట్టిస్తున్నారు. పోలీసులు సైతం ఇసుక వాహనాలను అడ్డుకోమని ముందస్తుగా చెప్పడంతో మరింత రెచ్చిపోయి పెసర్లంక, గాజుల్లంక రేవుల్లో ఎక్కడబడితే అక్కడ ఇసుక తవ్వకాలు సాగించారు . మధ్యాహ్న సమయానికి పోలీసుల్లో కదలిక రావడంతో ఒక్కసారిగా రేవుల వద్దకు వెళ్లి ఇసుక రవాణా చేయవద్దంటూ వాహనదారులకు చెప్పారు. దీంతో పోలీసులకు వాహనదారులకు వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో నిబంధనలను వివరించి ఇందుకు విరుద్ధంగా ఇసుక రవాణా జరగకూడదని పైనుంచి ఉత్తర్వులు వచ్చాయని వాహనదారులకు తెలిపారు. అయితే, నిత్యం ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుక రవాణా జరుగుతుంటే అప్పుడు నిబంధనలు గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తూ, పోలీసుల తీరును విమర్శించారు.



పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణానదిలో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లు (ఫైల్)

దళారుల కనుసన్నల్లో ఇసుక రవాణా ..

ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తూ ఇసుక రవాణాకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు పోలీసులు సహకారం కూడా ఉందనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. పైగా పోలీసులే ఓ దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఇసుక దందా సాగిస్తున్నట్లుగా సమాచారం. లంక గ్రామాల్లో కొంత మంది ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న విషయం పోలీసులకు తెలిసినప్పటికీ వాటిని నిలువరించే ప్రయత్నాలు చేయడం లేదని, ఇందుకు వారి నుండి భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి పట్టుబడిన వాహనాలు స్టేషన్‌కు తీసుకువచ్చినప్పటికీ అక్కడ అందే ముడుపుల ప్రకారం తహసీల్దార్, కోర్టులకు అప్పగిస్తున్నారని వాహనదారులు విమర్శిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన చిన్నపాటి నాయకులు కూడా ఇసుక దందా చేస్తూ పోలీసులకు ముడుపులు అందిస్తూ, తమ వాహనాలను అడ్డుకోకుండా చేసుకుంటున్నారని, ఇతరుల వాహనాలు ఇసుక రవాణా చేస్తుంటే వాటి గురించి పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారనేది బహిరంగ రహస్యమని బాధిత వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా నిలువరించి, ఉచిత ఇసుక పాలసీ సజావుగా సాగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

చింతలపూడి సచివాలయాన్ని సందర్శించిన ముఖ్యకార్యదర్శి మనోజ్ జోషి

- భూ రీ-సర్వేను ఫొటో ప్రదర్శనతో వివరించిన అధికారులు

దుగ్గిరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, భూవనరుల విభాగం ముఖ్యకార్యదర్శి మనోజ్ జోషి మండలం చింతలపూడిని గురువారం సందర్శించారు. తొలుత సచివాలయంలో నిర్వహించే రీ-సర్వే, ఇతర విధులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర సర్వే, భూమి రికార్డుల సర్వే డైరెక్టర్ శ్రీకేశ్ లత్కర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సందర్శించారు. రీ-సర్వేకు సంబంధించి వివిధ ప్రక్రియల వివరాలు తెలియజేసే ఫోటోప్రదర్శనను పరిశీలించారు. గ్రామంలో భూరికార్డుల స్వచ్ఛీకరణ, ప్రీడ్రోన్ ఫ్లైయింగ్, డ్రోన్‌ఫ్లై ఫ్లైయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్, రికార్డు అసిస్టేషన్, బౌండరీల నిర్ధారణ, అప్పీళ్ల పరిష్కారం, భూయజమానుల తుది వివరాల ప్రచురణ, తదితర ప్రక్రియల గురించి ఫోటోప్రదర్శన ద్వారా కలెక్టర్, జేసీ ఏ.భార్గవ్‌తేజలు వివరించారు. సర్వేకు ముందున్న ఆర్ఎస్ఆర్ భూరికార్డులు, గ్రామపటం, రీ-సర్వే, తద్వారా ఎల్‌బీఎం రికార్డులు తుదివివరాల గ్రామపటం, రీ-సర్వేకు వినియోగించిన పరికరాల ప్రదర్శనను మనోజ్‌జోషి తిలకించారు. అనంతరం ప్రియదర్శిని ఇంజనీరింగ్‌కళాశాలలో రైతులతో జరిగిన సమావేశంలో సమావేశమై రీ-సర్వేకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రికార్డుల ప్రకారం ఉన్న విస్తీర్ణం 2 నుంచి 5 సెంట్ల వరకూ తగ్గిందని, మరికొందరు రైతులు పూర్తిస్థాయిలో తమకు భూ రికార్డులు అందాయని, వాటిని రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం డీఐ ఎల్ఆర్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో జరిగిన రీ-సర్వేను పరిశీలనకు కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలు వచ్చాయని, భూ యజమానుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రీ-సర్వే అనంతరం తమకు న్యాయం జరిగిందని 20నుంచి 30 మంది రైతులు చెప్పారు.. హద్దులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం వలన వివాదాలకు తావులేకుండా పోయిందని వివ రించారు. రాష్ట్ర సర్వేల్యాండ్ రికార్డ్ డిప్యూటీ డైరెక్టర్లు గోవిందరావు, కెజియాకుమారి, సీజీవీఎస్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, సర్వే ఏడీ పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, పార్థసారధి, గోవిందరావు, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా, తహసీల్దార్ ఐ.సునీత, సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, కార్యదర్శి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న మనోజ్‌జోషికి వివరిస్తున్న రాష్ట్ర భూ రికార్డు సర్వే డైరెక్టర్ శ్రీకేశ్‌లత్కర్, చిత్రంలో కలెక్టర్ తదితరులు

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

- 'ప్రజాదర్బార్'లో వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రజాదర్బార్‌కు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపడంతో పాటు పరిష్కారమయ్యే వరకూ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం 43వ రోజు ఉండవల్లి ప్రజా దర్బార్‌లో పలు విజ్ఞప్తులు వచ్చాయి.



వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

- మంగళగిరి నియోజకవర్గ విజ్ఞప్తులు

కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న తన ఏకైక కుమారుడిని తోటి డ్రైవర్లు కలిసి హత్య చేశారని, విచారించి నిందితులను శిక్షించాలని ఉండవల్లికి చెందిన ఏపూరి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి ఆధారమైన కుమారుడిని కోల్పోవడంతో అనారోగ్యానికి గురయ్యానని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అనారోగ్యంతో భర్త మరణించడంతో తన ఇద్దరి పిల్లల పోషణ భారంగా మారిందని ఇల్లు మంజూరు చేయడంతోపాటు స్వయం ఉపాధి కల్పించి ఆదుకోవాలని నులకపేటకు చెందిన కొండ సుశీల కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన తమ భూమికి వార్షిక కౌలు అందడం లేదని, విచారించి కౌలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని నిడమర్రుకు చెందిన చల్లా పెద్ద అంకమ్మరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి కౌలు అందేలా చూస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. బి.కామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఎయిమ్స్‌లో ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన షేక్ మహమ్మద్ రఫి కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

సజ్జలను ఈడ్చుకొచ్చి జైల్లో పడేయండి

- ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు విచారణకు సహకరించకపోగా కూటమి ప్రభుత్వాన్ని, చంద్రబాబు విధానాన్ని విమర్శించ డం, హద్దులు మీరి మాట్లాడటం సజ్జల రామకృష్ణారెడ్డికి తగదని, అలాంటి వ్యక్తిపై కేసు పెట్టి నోటీసులు ఇచ్చే విధానం కాకుండా, ఈడ్చుకొచ్చి జైలులో పడేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరులో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు కనుకనే, ప్రతి విషయాన్ని పారదర్శకంగా ముందుకు తీసుకు వెళుతున్నారని అన్నారు. ప్రభుత్వం హద్దులు మీరుతోందని అనడంతో పాటు నోటికి వచ్చినట్లుగా చంద్రబాబుపై మాట్లాడుతున్న సజ్జల తీరుపై సామరస్యం పనికి రాదని, అలాంటి వ్యక్తి తీరును ఇప్పటికే ప్రజలు ఛీదరించుకుంటున్నారని, ఆయనపై ప్రభుత్వం కూడా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా సజ్జల తన నోటిని అదుపులో ఉంచుకోని పక్షంలో చట్టపరంగా కఠినమైన శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

డివిజన్ పరస్పర మార్పిడి వద్ద తగ్గనున్న సమయం

- పగిడిపల్లి - బొమ్మాయిపల్లి మధ్య రెండు వరుసల రైలుమార్గం
- రూ. 40.18 కోట్లకు టెండర్ పిలిచిన రైల్వే శాఖ
- ఏడాదిలోగా పూర్తి చేసేందుకు గడువు విధింపు

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ల మధ్యన రైళ్ల పరస్పర మార్పిడి జరిగే పగిడిపల్లి జంక్షన్ వద్ద ఏడాది వ్యవధిలోనే రెండు వరుసల రైలుమార్గం నిర్మాణం జరగనుంది. గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ఈ పనిని చేపట్టనున్నారు. పగిడిపల్లి - బొమ్మాయిపల్లి మధ్యన సింగిల్ లేన్ కారణంగా దెబ్బతింటున్న రైళ్ల సమయపాలన ఈ పని పూర్తితో పరిష్కారం కానుంది. రెండు వరుసల రైలు మార్గంతో ఇక ఇక్కడ రైళ్లు నిలుపుదల చేయకుండా డివిజన్ ఎక్స్ఛేంజ్‌ని సులభతరంగా చేయొచ్చు. ఇందుకోసం రైల్వే శాఖ తాజాగా టెండర్ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. గుంటూరు - సికింద్రాబాద్ రైలు మార్గంలో పగిడిపల్లి జంక్షన్ వద్ద డివిజన్ పరస్పర మార్పిడి రైళ్ల రాకపోకలకు పెద్ద అడ్డంకిగా మారింది. పగిడిపల్లి నుంచి గుంటూరు వైపునకు సింగిల్ లేన్ ఉండటం వలన ఏదైనా రైలుని సికింద్రాబాద్ వైపు నుంచి ఈ మార్గంలోకి తీసుకోవాలంటే ఎదురొచ్చే రైలుని బొమ్మాయిపల్లి వద్ద నిలిపేయాల్సిన పరిస్థితి. ఒకవేళ గుంటూరు వైపు నుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చే రైలు బొమ్మాయిపల్లి దాటి ముందుకొస్తే సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్లే రైలుని పగిడిపల్లిలో నిలిపేయాల్సి వస్తోంది. దీని వలన ఒక్కోసారి పావుగంట నుంచి అరగంట పాటు పగిడిపల్లి డివిజన్ ఇంటర్ ఛేంజ్ వద్ద నిలిపేస్తున్నారు. అక్కడి వరకు నిర్ణీత సమయానికి రైళ్లు వెళుతున్నా ఆ తర్వాత సికింద్రాబాద్ చేరుకోవడానికి కనీసం అరగంట నుంచి గంటకు పైగా జాప్యం జరుగుతోంది. వీటన్నింటికి పరిష్కారమార్గంగా పగిడిపల్లి - బొమ్మాయిపల్లి మధ్యన రెండు వరుసల మార్గం నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ పని కోసం టెండర్ నోటిఫికేషన్‌ని అప్‌లోడింగ్ చేసింది. ఈ నెల 24వ తేదీ నుంచి బిడ్డింగ్ ప్రారంభమై నవంబరు 7తో ముగుస్తుంది. మట్టిపని, మైనర్ బ్రిడ్జిలు, ఆర్‌యూబీల విస్తరణ, ప్లాట్‌ఫాంలు, సర్వీసు భవనాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, కవర్ ఓవర్ ప్లాట్‌ఫాంలు, ఎంఎస్ఈ గోడల నిర్మాణాలు, గులకరాళ్ల సేకరణ, డంపింగ్, పాత్ వే మెటీరియల్స్ సరఫరా, ట్రాక్ నిర్మాణం, లింకింగ్, పాయింట్ల అసెంబ్లీ, ఇన్‌సర్షన్, క్రాసింగ్‌లు, విద్యుద్దీకరణ, సిగ్నలింగ్ పనులన్నింటిని కలిపి రూ. 40 కోట్ల 18 లక్షల 18 వేల 35గా అంచనా వ్యయాన్ని నిర్ణయించింది. బిడ్డింగ్‌లో ఎవరు తక్కువకి కోట్ చేస్తే ఆ ఏజెన్సీకి పనిని కేటాయిస్తారు. ఎంవోయూ జరిగిన 12 నెలల్లోనే ఈ పనిని పూర్తి చేయాలన్న నిబంధనని కూడా చేర్చింది. దీని దృష్ట్యా వచ్చే ఏడాది ఆఖరుకు పగిడిపల్లి - బొమ్మాయిపల్లి డబ్లింగ్ పూర్తి అయి డివిజన్ ఇంటర్‌ఛేంజ్ సమస్యలు పరిష్కారమౌతాయని రైల్వే వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలి

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- అంతర జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్ షిప్ -24 ప్రారంభం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలలో ప్రావీణ్యం సాధించాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వ ర్యంలో సబ్ జూని యర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్థానిక బీ ఆర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే జిమ్నాస్టిక్స్ చాంపియన్ షిప్ -24 పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ క్రీడాకారుల ఫిట్నెస్ కోసం శిక్షణ శిబిరాల్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. బీఆర్ స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే జిమ్నాస్టిక్స్ పరికరాల కోసం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సాయంతో రూ.35లక్షలు కేటాయించినట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సుబ్బారావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే పోటీలో 250 మంది క్రీడాకారులు హాజరైనట్టు తెలిపారు. గెలిచిన వారు గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని అన్నారు. చీఫ్ కోచ్ నరసింహారెడ్డి, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి చల్లా వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డబుల్స్ హార్స్ ఛైర్మన్ మోహన్ శ్యామ్ ప్రసాదు, రెడ్‌క్రాస్ సభ్యులు వడ్లమాని రవి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్

ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగు తోంది. ఎగువన ఉన్న పులి చింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 61 వేల 072 క్యూసెక్కుల వరద నీరు గురువారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజ ర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 1 అడుగు, 10 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 57 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 3 వేల 056 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 516 క్యూసెక్కుల నీటిని వదులు తున్నట్టు జేఈ తెలిపారు. దిగువ నది ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు సూచించారు.

డీఎస్సీ శిక్షణకు కోచింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ కోసం అర్హులైన కోచింగ్ సెంటర్లనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డి ఎస్సీ శిక్షణ కోసం ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21 లోగా https://tender. apeprocurement.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు గతంలో కోచింగ్ ఇచ్చిన అనుభవం, ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలని స్పష్టం చేశారు.

డిగ్రీ 5, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

పెదకాకాని, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు గురువారం విడుదల చేశారు. బీకాం, బీఏ, బీఎస్సీ బీసీఏ, బీబీఏ, బీఏ ఓఎల్ కోర్సులకు సంబంధించి ఫలితాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. 5వ సెమిస్టర్‌లో 5973 మంది విద్యార్థులకు 4095 మంది 6వ సెమిస్టర్ లో 300 మందికి 202 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఏఎన్యూ. ఏసీ. ఇన్ లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఏ.శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి విద్యార్థులకు సందేహాలు ఉంటే రివాల్యుయేషన్ చేసుకోవచ్చని సూచించారు. నవంబర్ 2లోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్ చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పర్సనల్ వెరిఫికేషన్, రివాల్యుయేషన్ ఒక్కొక్క పేపర్ కు రూ .1490 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, డిగ్రీ పరీక్షల తాత్కాలిక కోఆర్డినేటర్ ఆచార్య ఎన్. వి.కృష్ణారావు, రీసెర్చ్ సెల్ తాత్కాలిక కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాష్ రావు, వై. రాధాకృష్ణ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్యోతి వర్మకు కాంస్యం

మంగళగిరి సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోవాలో జరుగుతున్న జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో గుంటూరుకు చెందిన మహిళా పవర్ లిఫ్టర్ పీ.జ్యోతి వర్మ కాంస్య పతకం సాధించారు. మాస్టర్స్-2 69 కిలోల బెంచిప్రెస్ విభాగంలో జ్యోతి వర్మ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయి మాస్టర్స్ విభాగంలో గుంటూరు జిల్లా నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళా లిఫ్టర్‌గా ఆమె నిలిచారు. పవర్ లిఫ్టింగ్ అసో సియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్య నారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తదితరులు జ్యోతి వర్మకు అభినందనలు తెలిపారు.



రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు

గుంటూరు(లీగల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్లు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ జి.స్పందన గురువారం తీర్పు చెప్పారు. ప్రాసి క్యూషన్ కథనం ప్రకారం, గుంటూరు పట్టణంలోని రామనామ క్షేత్రం లోని నాలుగో లైన్‌లో నివసిస్తున్న పసుపులేటి గణేశ్, ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో తన తండ్రి హరి శంకరరావు పట్నంబజార్‌లో నిర్వహిస్తున్న హార్డ్ వేర్ షాప్‌లో పని చేసేవాడు. 2021 అక్టోబర్ 12న హార్డ్ వేర్ షాప్‌నకు సంబంధించి ఆర్డర్ తీసుకునేందుకు గుజ్జనగుండ్ల వెళ్లాడు. ఈ క్రమంలో జేకేసీ కాలేజి రోడ్డులో బైక్‌పై వస్తుండగా, ఆర్టీవో ఆఫీసు వైపు నుంచి జేకేసీ కాలేజి వైపు అతివేగంతో వస్తున్న కారు అదుపు తప్పి గణేశ్‌ను ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన గణేశ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై రామిరెడ్డినగర్‌కు చెందిన కారు డ్రైవరు కంప రంజన్‌పై గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీ గాదె వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

250 బస్తాల నూకలు స్వాధీనం

కొల్లిపర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అత్తోటలో అక్రమంగా నిల్వ ఉన్న సుమారు 250 బస్తాల నూకలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నందివెలుగుకు చెందిన తన్నీరు శ్రీనివాసరావు అత్తోటలో సింగంశెట్టి శంకరరావు ఇంట్లో నూకలను నిల్వ ఉంచినట్లు సమాచారం రావటంతో ఏఎస్ఐ పోతురాజు, హెడ్‌కానిస్టేబుల్ రామకోటేశ్వరరావు, కానిస్టేబుల్‌లు నాగబాబు, అశోక్‌తో కలిసి తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ నూకలు పీడీఎస్ నూకలా, మామూలు బియ్యం నూకలా అని గుర్తించే పరీక్ష నిమిత్తం గుంటూరు పంపినట్లు చెప్పారు. పరీక్ష ఫలితాల అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	135, 145,155
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

50,582 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 51,885 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,582 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,786 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16500	334	9000	16000
నెంబరు.5	10000	13500	నెంబరు. 5	10000	13000
273	10000	13500	273	12000	12000
341	9500	15000	341	8500	17500
4884	11500	16200	4884	-	-
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18500	తేజ	9000	18400
బ్యాడిగి	8000	15500	బ్యాడిగి	9000	14200
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పట్టుబడిన మద్యం బాటిళ్ళు ధ్వంసం

బాపట్ల, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన అక్రమ మద్యంను పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు 49 కేసులలో స్వాధీనం చేసుకున్న వెయ్యి మద్యం బాటిళ్ళను డీఎస్పీ రామాంజనేయులు, పట్టణ సీఐ అహ్మద్‌జానీ, ఎస్ఐ విజయ్‌కుమార్ సమక్షంలో ధ్వంసం చేశారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడిన అక్రమ మద్యం బాటిళ్ళను బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో చందోలు ఎస్ఐ ఆర్.స్వామిశ్రీనివాస్, వీఆర్వో అరుణ ప్రసన్నలు మొత్తం 27 కేసులలో స్వాధీనం చేసుకున్న 222 మద్యం బాటిళ్ళను పోలీసుస్టేషన్ పరిధిలో సిబ్బందితో కలిసి గురువారం ధ్వంసం చేశారు.

● కర్లపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధగ్రామాలలో 22 కేసులలో పట్టుబడిన అక్రమ మద్యం 208 బాటిల్స్‌ను డిఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర సిబ్బంది, వీఆర్వో అమానుల్లాఖాన్, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో విద్యాబోధన చేయాలి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉపాధ్యాయులు అంకితభావంతో కూడిన విద్యాబోధన చేయాలని పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఖాజీపాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యాప్రగతిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ రఫీబుద్దిన్, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ ఇవ్వాలి

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు పాత్రికేయులతో కలిసి గురువారం కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. అనేక జిల్లాల్లో రాయితీ ఇస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా అమలు చేయాలని వారు కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కె.ప్రశాంత్, గొర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా కృష్ణారెడ్డి

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ డీఈగా ఎస్.కృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలో పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ కె.శ్రీనివాసరావు తెనాలి మున్సిపాలిటీకి బదిలీకావటంతో కృష్ణారెడ్డి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను అభినందించారు.


డీఈ కృష్ణారెడ్డి

'ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ ఆరోపణలు'

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అవినీతి చక్రవర్తిగా అనేక కేసులలో నిందితుడిగా ఉన్న మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అవినీతి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఆరోపణలు చేస్తున్నారని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ చేసే దుష్ప్రచారం నిజమైతే సీమన్స్‌కంపెనీపై తీసుకున్న చర్యలే చంద్రబాబుపై తీసుకోవాలి కదా అని ప్రశ్నించారు? చంద్రబాబుపై రాజకీయ కక్షతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని కొల్లా విమర్శించారు.

పేద విద్యార్థినికి చేయూత

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిపూడి గ్రామానికి చెందిన విద్యార్థిని చదువుకు ఆర్థిక ఇబ్బందులుపడుతున్నట్లు గుర్తించిన కేకేఆర్ చారిటబుల్ ఫౌండేషన్‌వారు గురువారం ఆర్థికసాయం అందజేశారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఫార్మాడి చదువుతున్న ఎం.మోహనశ్రీ ప్రవల్లిక తండ్రి చనిపోయి ఫీజులు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నట్లు గుర్తించి ఫౌండేషన్ అధ్యక్షుడు ఓటికుండ విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో ఓటికుండ లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడు ఓటికుండ శ్రీనివాసరెడ్డి, కోశాధికారి కుమ్మరి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు, జోగి సువర్ణరాజులు కలిసి రూ.61 వేల చెక్కును అందజేసి ఉన్నతంగా చదువుకొని ప్రయోజకురాలు కావాలని ఆకాంక్షించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు ముందస్తు ప్రణాళికతో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణా సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ తెలిపారు. బాపట్ల ఏరువాక కేంద్రం కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన చెరువుజమ్ములపాలెం గ్రామంలోని వరిపొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బాలమురళీధర్‌నాయక్, విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి : వైసీపీ

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపర్చాలని వైసీపీనాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వైసీపీ పట్టణ, మండలాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి తదితరులు కలిసి కమిషనర్‌కు పట్టణ సమస్యలను వివరించారు. అలాగే రోడ్డు విస్తరణ సమయంలో తొలిగించిన జాతీయ నాయకుల విగ్రహాలను తిరిగి అదేప్రాంతంలో ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా, అడే చందు, తస్నీరు అంకమ్మరావు, అప్జల్, పసుమర్తి సాల్మన్, గోపి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు


గ్రామస్తులతో కలిసి సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కూటమి పాలనలో ప్రగతి బాటలు

● ఎమ్మెల్యేలు ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో గ్రామాలను ప్రగతి బాటలో నడిపేందుకు కృషి జరుగుతోందని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే మండలంలోని జంపని, వేమూరు గ్రామాలలో రూ.60 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని, అభివృద్ధికి దూరంగా పెట్టారని విమర్శించారు. కూటమి పాలన ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో పంచాయితీరాజ్ శాఖలో అనేక మార్పులు తీసుకురావడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ శ్యాంప్రసాద్, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోపీఆర్డీ శేఖర్, పంచాయితీరాజ్ ఏఈ బదిరీనాథ్, జంపని సర్పంచ్ చుండూరు పెదమరియమ్మ, బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ షేక్ హనీఫ్, ఉపసర్పంచ్ వాసుదేవనాయుడు, కార్యదర్శులు రెహమాన్, భూపతిరెడ్డి, టీడీపీ నాయకులు జయప్రకాష్, వేల్పుల రవి, వట్టిప్రోలు యోబు, గవిని లక్ష్మీదుర్గ, రెడ్డమ్మ, కలవ మణికంఠ, మన్నె లక్ష్మీ, కోగంటి రాజేష్, యలవర్తి సురేంద్ర, కోగంటి శ్రీనుబాబు అన్నే ప్రసాద్, గోపినాథ్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, అక్టోబరు 17 : కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రం, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని కూచిపూడిలో గురువారం జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆనందబాబు మాట్లాడుతూ పంచాయతీలను జగన్ భ్రష్టు పట్టించాడని ఆగ్రహం వ్యక్తపరిచారు. రూ.30 లక్షలతో 5 పనులకు భూమి పూజ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో మారుతీ శేషమాంబ, యలవర్తి బ్రహ్మానందం, యలమంచిలి జగన్మోహనరావు, తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, మేకా రాంబాబు, రామకృష్ణ, మాన్యం కృష్ణమూర్తి, యలవర్తి రఘు, ఎం.ఆనంద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సమ్మెటవారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వై.భూపతిరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సమ్మెట నాగేంద్రరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

● బాపట్ల, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు కల్లు గీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ అన్నారు. మండలంలోని నందిరాజుతోట గ్రామంలో అంగన్‌వాడీ భవనం చుట్టూ రూ.16 లక్షలతో నిర్మించే ప్రహరీ పనులను, పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి మరిచారన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపిడివో బాబురావు, గ్రామ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు, కందుల బాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే నూతన ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో శోభారాణి అన్నారు. రేపల్లె మండలం అరవపల్లి, నెల్లూరువారిపాలెం గ్రామాల్లో సీసీ రహదారులకు గురువారం భూమిపూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రేపల్లె మండలంలో ఒక్కొక్క పంచాయతీకి రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు రహదారుల నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేయటం జరిగిందని, ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సంక్రాంతిలోపు రహదారులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం టీడీపీ నాయకులు బొందలపాటి మల్లికార్జునరావు, నెల్లూరురెడ్డియ్య, భూపతి సాంబశివరావు, గూడవల్లి బాబూరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● చుండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. మున్నంగివారిపాలెంలో రూ.34 లక్షలతో, చుండూరులో రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణపు పనులు చేపట్టారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు గుదేటి ఎల్లారెడ్డి, మున్నంగివారిపాలెం సర్పంచ్ అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, ఇక్కుర్తి శ్రీనివాసరావు, కుర్రి వెంకటరెడ్డి, మాడసాని తిరుమూర్తి, శివబ్రహ్మారెడ్డి, శ్రీమాన్, ఉయ్యూరు బ్రహ్మారెడ్డి, సజ్జా సాంబయ్య, పంచాయితీ ఏఈ మరియదాసు, ఏపీవో సురేష్, పంచాయితీ, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సులభ కాంప్లెక్స్ మూత

● ఇబ్బందులు పడుతున్న రైల్వే ప్రయాణికులు

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే బాపట్ల రైల్వేస్టేషన్ కూడలిలోని సులభకాంప్లెక్స్‌ను మూడునెలలుగా మూసివేశారు. మున్సిపల్ అధికారులు దీని నిర్వహణకు సరైన చర్యలు తీసుకోకపోవటంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి అయితే మరింత ఇబ్బందికరంగా ఉంది. రైల్వేస్టేషన్‌కి వచ్చిపోయేవారి అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ అధికారులు గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ సులభకాంప్లెక్స్ నిర్మించారు. కొంతకాలం సక్రమంగా నిర్వహించినప్పటికి ఆతర్వాత అక్కడ ఉండే వ్యక్తులు వెళ్ళిపోవటంతో మున్సిపల్ అధికారులు దీనిని మూసివేశారు. ఫలితంగా దూరప్రాంతాలు నుంచి వచ్చే ప్రయాణికులు టాయిలెట్‌కు వెళ్ళటానికి మరుగుదొడ్లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్ల నిర్మాణం నూతనంగా చేపట్టి పాతవి కూడా ఆధునీకరిస్తున్నారు. దీనివల్ల అటు స్టేషన్‌లో, ఇటు బయట మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవటంతో తీవ్ర విమర్శ చేస్తున్నారు. కాగా ఈ విషయమై మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా రెండునెలలుగా సులభకాంప్లెక్స్ నిర్వాహకులు లేక మూసివేయటం జరిగిందన్నారు. అక్కడ ఉన్న వాటర్ మోటరు కూడా అపహరణకు గురైందని, దీనివలన ట్యాంక్‌కు నీరు పెట్టే పరిస్థితి లేదన్నారు. వెంటనే సులభకాంప్లెక్స్ ఓపెన్ చేసి ప్రస్తుతం ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.


బాపట్ల రైల్వేస్టేషన్ దగ్గర చంద్రకళా పార్క్ పక్కనే మూసి ఉన్న సులభకాంప్లెక్స్

మురుగునీటి మధ్యజీవనం... వ్యాధుల బారిన ప్రజానీకం

బాపట్ల,అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో ఇళ్ళ మధ్య నిలిచిన నీటిలోనే ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ప్రతినెల కురుస్తున్న వర్షాల వల్ల ఇళ్ళ చుట్టూ ఖాళీ స్థలాలలో నిలిచిన నీరు బయటకెళ్ళక మురుగు కుంటలుగా మారాయి. దీనివల్ల దోమలవ్యాప్తి అధికమైనది. ప్రజలు జ్వరాలు, ఇతర వ్యాధుల బారీనపడి అల్లాడుతున్నారు. అయినప్పటికి మున్సిపల్ అధికారులు ముంపు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించలేకపోతున్నారు. 32వవార్డు హయ్యర్‌నగర్‌లో ఇళ్ళ మధ్య నిలిచిన నీరు బయటకెళ్ళే మార్గంలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే నీటిని తొలిగించాలని స్థానికులు డిమాండ్ చేయటంతో కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. యాంటీలార్వా నిలిచిన నీటిలో స్ప్రే చేయించారు. వ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్ చల్లించారు. అదేవిధంగా 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో రోడ్డుపక్కనే నిలిచిన నీరు రోడ్లపైకి రావటాన్ని పరిశీలించారు. 24వ వార్డు డ్రైవర్స్‌కాలనీలో విద్యుత్‌మోటర్లు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపించే ఏర్పాటు చేశారు. సమస్య అన్నివార్డులలో ఉంది కావున శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


హయ్యర్‌నగర్‌లో ఇళ్ళ మధ్య నిలిచిన వర్షపునీరు

కూరగాయల మార్కెట్ పరిశీలన


రాజీవ్‌గాంధీకాలనీలో వర్షపునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

బాపట్ల కూరగాయల మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. రిటైల్ వ్యాపారులతో మాట్లాడి అందరు కలిసి సమన్వయంతో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వెన్నెలకంటి నగర్, శారదాపురికాలనీ, ఇందిరానగర్‌కాలనీ, చంద్రకళాపార్క్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ జి.ఉమామహేశ్వరరావు, రెవెన్యూ ఆఫీసర్ షేక్ జబ్బార్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

బాపట్ల, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు గ్రామీణ సాంఘిక విమోచన సేవాసంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ జె.వెంకటమురళి ఆవిష్కరించారు. విద్యార్థినులు, భిక్షాటన చేసే పిల్లలు, నిర్బంధానికి గురైన వృద్ధుల పక్షాన పని చేయనున్నట్లు సంస్థ నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ జె.రాజాదెబోరా పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన కళ్ళేపల్లి శ్రీనివాసరాజు సమీప బంధువుల ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి గత ఏడాది నవంబరు నెలలో చందోలు పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. చందోలు ఎస్ఐ ఆర్.స్వామిశ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పొన్నూరుకి చెందిన షేక్ కరీముల్లా అనే నిందితుడిని పట్టుకొని విచారించి దొంగతనానికి గురైన సోనికలర్ టివి, రెండు సవర్ల బంగారు గొలుసులు స్వాధీనం చేసుకొని ముద్దాయిని జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం గ్రామపంచాయతీకి చెందిన ముత్యాల మరియమ్మ తన కుమార్తె కనిపించటంలేదని ఈనెల 15వ తేదీన చందోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై కేసు నమోదు చేసుకున్న చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి విచారించారు. అదృశ్యమైన బాలిక చీరాలలో ఉన్నట్లు కనుగొని గురువారం బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెను అప్పగించినందుకు బాలిక తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎస్ఐకు అభినందనలు తెలిపారు.

వైసీపీ మండల అధ్యక్షుడిపై కేసు

బాపట్ల, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 34వవార్డు దరివాదకొత్తపాలెంలో దేవతామూర్తుల విగ్రహాలు ఊరేగింపు చేయటాన్ని అడ్డుకుంటున్న వైసీపీ నాయకుడు కోకి రాఘవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆప్రాంత మహిళలు గురువారం పట్టణ పోలీసుస్టేషన్ దగ్గర ఆందోళన చేశారు. బుధవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు చేస్తుండగా రాఘవరెడ్డి తన అనుచరులతో వచ్చి డిజె బాక్స్‌లు ఆపేసి అతనిపై దాడి చేశారని మహిళలు అన్నారు. ఈ కార్యక్రమంలో మరుప్రోలు జయలక్ష్మి, ఆసోది నాగేంద్రమ్మ, మున్నం నాగేంద్రమ్మ, నాయుడు ధనలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, శవనం సంజీవమ్మ, దొంతిన వెంకమ్మ, దేవి సోమమ్మ, ఆసోది కోటేశ్వరమ్మ, బుజ్జి వెంకటేశ్వరమ్మ, రమణ, శ్రీదేవి ఉన్నారు. కాగా ఈ విషయమై పట్టణ సీఐ అహ్మద్‌జానీని వివరణ కోరగా ఆసోది కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కోకి రాఘవరెడ్డితోపాటు మరో 8 మందిపై ఎస్ఐ విజయ్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డిజె నిర్వాహకుడిని కొట్టినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

బాపట్ల,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం వారు మాట్లాడుతూ 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు టీచింగ్ స్కిల్స్ పెంపొందించటానికి అన్నట్లు ఈనెల 21 నుంచి ఆరు రోజులపాటు రాష్ట్రంలోని 9 కేంద్రాలలో శిక్షణ జరపటానికి ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని శిక్షణను విరమించుకోవాలని వారు కోరారు. అవసరమైతే నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలో మండల కేంద్రాలలో, డివిజన్ కేంద్రాలలో శిక్షణ ఇచ్చే పద్ధతిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ బడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ టివి సురేష్, కోశాధికారి డి.ప్రసాదరావు, జె.వినయ్‌కుమార్, పీడీ సోషలిజం, ఎన్.సురేష్‌బాబు, సి.హెచ్.వి.కుమారి, ఎస్‌కె ఘనసైదా పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణకు మండల పరిధి గ్రామాల్లోని పట్టభద్రులైన వారు ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ సుశీల కోరారు. ఆమె గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఇంతవరకు మండల పరిధి గ్రామాల నుంచి ఓటు నమోదు నిమిత్తం 237 దరఖాస్తులు అందాయన్నారు. వాటిని పరిశీలించేందుకు వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నవంబరు 11వ తేదీ వరకు గడువు ఉన్నందున ఈ లోగా అర్హత ఉండి ఇంకా ఓటు నమోదు చేయించుకోవలసిన వారు ఆన్‌లైన్‌లో గాని, మాన్యువల్‌గాని దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని తెలిపారు.


వాల్మీకి మహర్షి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు

చరిత్రపుటలలో చిరస్థాయిగా నిలవనున్న వాల్మీకి రచనలు

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆది కవి వాల్మీకి మహర్షి రచనలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వాల్మీకి పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతంలో 24 వేల పద్యాలు రామాయణాన్ని ఆదికావ్యంగా రాసిన వాల్మీకి ఆదికవిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల, సీపీవో శ్రీనివాసులు, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, సివిల్ సప్లై జిల్లా అధికారి విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడి మాట్లాడుతూ ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మధుర కావ్యాన్ని యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచేవిధంగా సమాజానికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ

● బాపట్ల వ్యవసాయ కళాశాలలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వాల్మీకి పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ వి.జ్యోతి, డాక్టర్ కె.విజయప్రకాష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి వాల్మీకి మహర్షి పటానికి పుష్పాంజలి ఘటించారు. మహర్షి బోధనలు, ధైర్యం, కరుణ, విశ్వాసంతో కూడిన జీవితాన్ని గడపటానికి స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు, మేనేజర్ లక్ష్మణ్, ఏఈ ఉమామహేశ్వరరావు, ఆర్వో జబ్బార్, సిబ్బంది పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు గ్రంథాలయ పాఠకులు తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ దండు లక్ష్మీనరసరాజు, బాపట్ల జిల్లా ధర్మప్రచారకర్త అక్కల సుబ్బారెడ్డి, గ్రంథాలయ పాఠకులు, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుశీల అధ్యక్షతన గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు వాల్మీకి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీజ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఏవోలు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రేపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకుని ముందుకు వెళ్ళాలని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. నిజాంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జవాబుదారితనంతో పని చేయండి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు జవాబుదారితనంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులను ఆదేశించారు. కర్లపాలెం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆశాఖాధికారులకు సూచించారు. వినియోగదారులు ఫోన్ చేసినా వెంటనే స్పందించాలన్నారు. మండలాభివృద్ధి ప్రణాళికపై చర్చించి సభ్యుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. సమావేశంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి రవికుమార్ (అంతరచిత్రంలో) హరేరామకృష్ణ (ఫైల్)

పంచాయతీరాజ్ ఈఈ హరేరామకృష్ణ హఠాన్మరణం

బాపట్ల, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఈఈ జాగర్లమూడి హరేరామకృష్ణ (61) గురువారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఒంగోలు నుంచి విధులకు వచ్చేందుకు సిద్ధపడుతుండగా స్ట్రోక్ వచ్చి మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి తరలించారు. ఆయన ఆకస్మిక మృతి విషయం తెలిసిన వెంటనే పల్లెపండుగ కార్యక్రమంలో ఉన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ గ్రామానికి వచ్చి హరే రామకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గురువారం ఆయన పమిడిపాడు చేరుకుని రామకృష్ణ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. హరే రామకృష్ణ మృతదేహానికి కలెక్టర్ జె.వెంకటమురళి నివాళులర్పించారు. పంచాయతీరాజ్, మండలపరిషత్ ఉద్యోగులు, సిబ్బంది సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. హరేరామకృష్ణకు భార్య కృష్ణకుమారి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు కృషి చేయాలి


వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కోరారు. లక్ష్మీగణపతి కళ్యాణ మండపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రెడ్డి పరిచయ కార్యక్రమం గురువారం జరిగింది. అశోక్‌బాబు మాట్లాడుతూ, కార్మికుల పక్షాన పోరాటం చేసేందుకు గౌతమ్‌ని గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాలో గత ఎన్నికల్లో ఓటమి చెందామని అయినప్పటికీ ఎమ్మెల్సీగా గెలవడం ద్వారా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వైసీపీ బలాన్ని నిరూపించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చుండూరు ఎంపీపీ జాలాది రూబెను, మాజీ ఎంపీపీలు పెరికల పద్మారావు, ఉయ్యూరు అప్పిరెడ్డి, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, కోగంటి లవకుమార్, కొండా శివప్రసాదరెడ్డి, బొల్లిముంత ఏడుకొండలు, భట్టిప్రోలు ఎంపీపీ లలితకుమారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాగర్ నుంచి నీటి విడుదల

● దిగువకు 4 క్రస్ట్‌గేట్ల ద్వారా..

మాచర్లటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ 4 క్రస్ట్‌గేట్ల ద్వారా అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. 4 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32400 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నారు. కాగా సాగర్ నీటి మట్టం 590 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 8067, ఎడమ కాల్వ ద్వారా 6173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29476, క్రస్ట్‌గేట్ల ద్వారా 32400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 మొత్తం ఔట్‌ఫ్లో 78916 క్యూసెక్కులు నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 78916 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

షూటర్ ముఖేష్‌కు సత్కారం



నేలవల్లి ముఖేష్‌ను సత్కరిస్తున్న కేఎల్‌యూ వీసీ డాక్టర్ సారథివర్మ

తాడేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున పాల్గొని ఐదు బంగారు పతకాలను సాధించిన షూటర్ నేలవల్లి ముఖేష్‌ను కేఎల్‌యూ వీసీ డాక్టర్ జీ పార్థసారథివర్మ సత్కరించారు. వర్సిటీలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ తమ విద్యార్థి అయిన ముఖేష్ ఇటీవల పెరూ దేశంలోని లిమాలో జరిగిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారన్నారు. వర్సిటీలో సీఎస్ఐటీ మూడో సంవత్సరం చదువుతున్న ముఖేష్ ఆరు విభాగాల్లో జాతీయ జట్టుకు ఎంపికై 10 పతకాలకు పోటీపడగా ఐదు బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖర్‌రావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కే హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ సమయపట్టిక మార్పు

● 18వ తేదీ నుంచి రాత్రి 10.55కే గుంటూరుకు రాక

● తిరుపతికి వేకువజామున 5.55కే చేరిక

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నెంబరు. 12734 లింగంపల్లి - నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని పాత సమయపట్టికలోనే నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ రైలు షెడ్యూల్‌ని ఇంచుమించు ఏడాది క్రితం మార్చినప్పటి నుంచి అర్ధరాత్రి దాటాక గుంటూరుకు వస్తున్నది. ఇక తిరుపతి చేరేసరికి ఉదయం 8 గంటల సమయం అవుతుండటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం(ఈ నెల 18వ తేదీ) నుంచి షెడ్యూల్‌ని మారుస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఇక నుంచి నిత్యం సాయంత్రం 5.30 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి సికింద్రాబాద్‌కు 6.05కి వచ్చి 6.10కి బయలుదేరుతుంది. ఈ రైలు నల్గొండకు రాత్రి 7.37కి, మిర్యాలగూడకు 8.04కి, నడికుడికి 8.34కి, పిడుగురాళ్లకు 8.54కి, సత్తెనపల్లికి 9.22కు, గుంటూరుకు 10.55కి వస్తుంది. గుంటూరులో 10 నిమిషాల హాల్టింగ్ అనంతరం రాత్రి 11.05కి బయలుదేరి తిరుపతికి మరుసటి రోజు వేకువజామున 5.55కి చేరుతుంది. మారిన షెడ్యూల్ ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంటుందని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

నిర్దేశించిన విధానాలు పాటిస్తేనే రైతులకు అధిక లాభాలు

-డీఏఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన విధి విధానాలు తప్పనిసరిగా పాటించడం వలన రైతులకు నాణ్యమైన ఉత్పత్తి లభించి అధిక లాభం పొందడంతో పాటు సుస్థిర వ్యవసాయానికి దోహద పడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కృషి భవన్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యవసాయ అధికారులకు ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ ముఖ్యఉద్దేశం వ్యవసాయ అధికారులు కచ్చితంగా అర్థం చేసుకుంటేనే కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు. ఎంపిక చేసిన రైతులకు ఇండి గ్యాప్ సర్టిఫికేషన్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, తద్వారా వారికి ఎన్నో మెరుగైన అవకాశాలు దక్కుతాయని అన్నారు. ఈ విధానంలో ప్రతి మండలంలో 5 నుంచి 6 మంది రైతులను డివిజన్ స్థాయిలో ఒక ఎఫ్ పీ వో కు అనుసంధానం చేసి, వారు పండించిన ఉత్పతుల నాణ్యతను ఎన్ ఏ బీ ఎల్ గుర్తింపు కలిగిన ల్యాబ్‌ల ద్వారా పరీక్షించి స్కోప్ సర్టిఫికేట్ జారీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలు నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రంగు వేయని బెల్లంతో తయారుచేసిన నల్ల జిలేబి



తెనాలిలో తయారుచేసే బెల్లం జిలేబి



తరాలు మారినా.. తరగని తియ్యదనం

తెనాలి... ఈ పట్టణం పేరు వినగానే సినీ, నాటకరంగ కళాకారులు, స్వాతంత్రోద్యమ వీరులు గుర్తొస్తారు. అయితే మూడు కాల్వలు ప్రవహించే తెనాలికి ఆంధ్రాప్యారిస్ అనికూడా మరో ప్రత్యేకమైన పేరుంది. అయితే తెనాలికే ప్రత్యేకతను తెచ్చిపెట్టిన వంటకం ఏదంటే మాత్రం తెనాలి పట్టణవాసులకే కాకుండా దేశ, విదేశాల్లోని వారికి గుర్తొచ్చేది బెల్లం జిలేబి. ఇది ఎంతగానంటే ఆ పదం నోటి వెంట వచ్చిందంటే చాలు... నోరూరిపోవాల్సిందే. స్వచ్ఛమైన రంగు లేని బెల్లం, రంగు వేసిన బెల్లం వంటివాటితో రెండు రకాలుగా తయారు చేస్తుండటంతో జిలేబి ప్రియులకు జిహ్వాచాపల్యం తీరిపోయినట్టే.

- నోరూరించే తెనాలి బెల్లం జిలేబి
- ఆరు దశాబ్దాల నుంచి తెనాలికి ప్రత్యేకం
- దేశ విదేశాల్లోని జిలేబి ప్రియుల కోసం ఇక్కడి నుంచి పార్సిల్స్
- ఒక వీధికే జిలేబి కొట్ల బజారుగా పేరుతెచ్చిపెట్టి...

తెనాలి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మినప పప్పు, బియ్యపు పిండి, మైదాను ఉపయోగించి జిలేబీ చుట్టలు తయారు చేయటం ఇక్కడి ప్రత్యేకత. ముందురోజే పిండి సిద్ధం చేసుకుని నిల్వ ఉంచాల్సి రావటంతో అన్ని ప్రాంతాల్లో బెల్లం జిలేబీని తయారు చేయటానికి ఆసక్తి చూపరు. ఎక్కువ శాతం పంచదార జిలేబీనే తయారు చేస్తుంటారు. కనీసం 8 గంటలు పిండి నిల్వ ఉండాల్సి ఉండటం, ఒక రోజులో ఎంతమంది కొనుగోలు చేస్తారనేది తేలని విషయం కావటంతో మిగిలిన ప్రాంతాల్లో ఇది ప్రాచుర్యం పొందలేదు. అయితే తెనాలి జిలేబీకి 60 ఏళ్ళ చరిత్ర ఉండటం, స్థానికులే కాకుండా దేశంలోని ఇతర పట్టణాలు, నగరాల నుంచి వచ్చినవారు కూడా తప్పనిసరిగా కొనుగోలు చేస్తారు. దీంతో ఇక్కడి జిలేబీకి మంచి డిమాండ్ ఉండటంతో భారీ స్థాయిలో తయారు చేస్తుంటారు. ఎప్పుడు చూసినా వేడిగా జిలేబీ లభించటానికి ఆ డిమాండే కారణం కూడా. తెనాలి వచ్చారంటే జిలేబీ తీసుకోకుండా ఇతర ప్రాంతాలవారు వెళ్లరంటే అతిశయోక్తి కాదు. అయితే దీని జిహ్వాచాపల్యం ఇక్కడితో ఆగకుండా విదేశాలకూ పాకింది. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలకు ఇక్కడి నుంచి పార్శిల్స్ కూడా వెళతాయంటే తెనాలి జిలేబీకి ఎంతటి ప్రాముఖ్యత ఉందనేది అర్థమవుతుంది. కరోనా ముందు తెనాలి పట్టణంలో 50కిపైగా జిలేబి దుకాణాలుంటే, ప్రస్తుతం 20కి తగ్గాయి. అయితే దీని ఆదరణ మాత్రం తగ్గలేదు. తెనాలిలోని సత్యన్నారాయణ టాకీస్ ఉన్న రోడ్‌లో ఈ జిలేబీ దుకాణాలు ఉండటంతో ఈ రోడ్డుకు జిలేబీ కొట్ల బజారుగా పేరు మారిపోయింది. వాస్తవానికి ఈ రోడ్ పేరు యాకూబ్ హుస్సేన్ రోడ్. అయితే జిలేబి దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఆ పేరునుకాస్తా జిలేబికొట్ల బజారుగా జనం మార్చేశారు. రోజుకు ఒక్కో దుకాణంలో 50 నుంచి 80 కిలోల జిలేబీ అమ్మకాలు జరుగుతుంటాయని చెబుతారు. ఒక్క నెలలో రూ. 12 లక్షల నుంచి రూ. 15 లక్షల వ్యాపారం ఒక్క జిలేబి అమ్మకాలపైనే సాగుతుందంటే జిలేబీ ప్రియులు ఎంతమందున్నారనేది అర్థమవుతుంది.

సుమారు 100 సంవత్సరాల నుంచి జిలేబి వంటకం ఇక్కడ తయారీలో ఉందనే ప్రచారం ఉంటే, ఇప్పటి తరం చెబుతున్న ఆధారాల ప్రకారం మాత్రం ఆరు దశాబ్దాల నుంచి బెల్లం జిలేబి తయారీ ఉందని చెబుతున్నారు. 1965లో తొలిసారి చీమకుర్తి సుబ్బయ్య అనే వ్యక్తి రంగులేని బెల్లం జిలేబీని ఆ రోజుల్లోనే తయారు చేశారనేది నానుడి. రంగు లేకుండా నల్లగా ఉండటంతో కంటికి తినాలనిపించేలా లేకపోవటంతో 1972లో బొట్లగుంట్ల రామయ్య అనే వ్యక్తి రంగు వేసిన బెల్లంతో నోరూరించేలా జిలేబీని తయారు చేసేవారని చెబుతుంటారు. అయితే రంగు వేసినా కర్నాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించుకున్న బెల్లాన్ని ప్రస్తుతం వాడుతున్నామని వ్యాపారులు చెబుతుంటారు.

జిలేబీ తయారీకి సంబంధించి సమయం, శ్రమ తగ్గించే యంత్రాలు చాలానే వచ్చినా ఇక్కడ మాత్రం ఎటువంటి పరికరాన్ని వాడకుండా, ప్రత్యేకంగా తయారు చేయించిన దవళ వస్త్రంలాంటి దానిలో పిండివేసి, దానికున్న రంధ్రం ద్వారా జిలేబీ చుట్టలు నూనెలో వేసి తయారు చేస్తుంటారు. ఇక్కడి జిలేబీకి అంతటి ప్రత్యేకత రావటానికి ఇవన్నీ కారణమయితే, బెల్లంకూడా ఒక ప్రత్యేకమే. నోరూరించే జిలేబీ రోజూతిన్నా వెగటు లేకుండా జనం ఆదరించటానికి దీని తయారీనే ఓ ప్రత్యేకం. పైగా బెల్లంతో తయారు చేయటంతో ఐరన్ పోషకాల వంటి ఆరోగ్యకర లక్షణాలు కూడా దీని సొంతమనేది స్థానికులు చెప్పేమాటే. అదీ తెనాలి బెల్లం జిలేబీ చరిత్ర. మీకూ నోరూరిపోతుందా! అయితే వెంటనే మీది తెనాలి.. మాది తెనాలే అంటూ తెనాలి బాట పట్టాల్సిందే.

అమరావతిలో నేషనల్ గేమ్స్‌కు కృషి

◆ మంగళగిరిస్టేడియంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు ◆ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఎంపీ కేశినేని



క్రీడా జెండా ఎగురవేస్తున్న ఎంపీ చిన్ని, పక్కన ఎమ్మెల్యే నరేంద్ర, వీసీ గంగాధర్ రావు తదితరులు



పెదకాకాని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో 2027లో నేషనల్ గేమ్స్ నిర్వహణకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురువారం 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్-2024 గేమ్స్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఆయన ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ పతకాన్ని ఆవిష్కరించి క్రీడాకారుల నుంచి గౌరవ వందన స్వీకరించిన అనంతరం ప్రసంగించారు. క్రీడలను ప్రోత్సహించడానికి చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో డిసెంబరు నుంచి జనవరి వరకు ప్రతి గ్రామంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలనే క్రీడా సంబరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి స్టేడియాన్ని శాప్ తరఫున అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాన్ని ఏడాదిన్నర లోపు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ స్టేడియంలోనే క్రీడాకారులకు ఉపయోగపడేలా స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడలపై పిల్లల్లో ఆసక్తి పెరిగితే ఇంటర్‌నెట్, సోషల్ మీడియాకి దూరంగా ఉంటారన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో అసంపూర్తిగా వదిలేసిన క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ పి.ఎస్.గిరీష్, ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మనోజ్ కే అరోరా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



నందిగం బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

హత్య కేసు వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మరియమ్మ అనే మహిళ హత్య కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసు పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ.. విచారణను వారం రోజులు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ 2020 డిసెంబర్ 27న హత్యకు గురైంది. ఆమె కుమారుడి ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో నందిగం సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో పోలీసులు ఇటీవల ఆయన్ను అరెస్ట్ చేశారు. బెయిల్ పిటిషన్‌ను గుంటూరు ప్రత్యేక కోర్టు కొట్టివేయడంతో.. సురేశ్ హైకోర్టును ఆశ్రయించారు.

వైద్యాధికారి ఆత్మహత్యాయత్నం

ఉన్నతాధికారుల ఒత్తిడి కారణమని ఆరోపణ



చికిత్స పొందుతున్న డాక్టర్ కమలాకర్‌రావు

వినుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఈపూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ టి.కమలాకర్‌రావు ఆత్మహత్యకు యత్నించాడు. వినుకొండ ప్రభుత్వాస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. తనకు వైద్యశాల బాధ్యతలు వద్దని ఉన్నతాధికారులకు చెప్పినా సీనియర్ అని ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఆరోగ్యశ్రీ డీఈవో అనంతకిశోర్ మాటలు నమ్మి ఆస్పత్రి నిధుల నుంచి కమలాకర్‌రావు రూ.లక్ష ఇచ్చారు. ఆ సొమ్ము ప్రభుత్వానికి చెల్లించాలని, క్షమాపణ పత్రం రాసివ్వాలని అనంతకిశోర్‌ను అడగ్గా ఆయన నిరాకరించాడు. ఈ విషయాన్ని తన బంధువైన డీసీహెచ్‌వో రంగారావుకు అనంతకిశోర్ తెలిపాడు. దీంతో డీసీహెచ్‌వో వైద్యశాలను సందర్శించి లేని పోని వంకలతో కమలాకర్‌రావుపై విధులకు సంబంధించి ఒత్తిడి పెంచారు. ఇదే సమయంలో ఆస్పత్రిలోని ఫార్మాసిస్టు కక్షకట్టి అనంతకిశోర్‌తో కలిసి నిత్యం వేధిస్తుండేవారని కమలాకర్‌రావు వాపోయారు. అనంతకిశోర్‌కు చెల్లించిన నగదు రికవరీ కాకాపోతే తన ఉద్యోగం పోతుందని, రూ.40 లక్షల అప్పులున్నాయని ఆందోళన, వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కమలాకర్‌రావు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కోఆర్డినేటర్(డీసీహెచ్‌వో) రంగారావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సచివాలయ డిస్పెన్సరీలో గుండెపోటు నివారణ ఇంజెక్షన్లు

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయ సివిల్ డిస్పెన్సరీలో గుండెపోటు నివారణ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని డిస్పెన్సరీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హదస్సా తెలిపారు. సచివాలయ ఉద్యోగులు అత్యవసర సమయాల్లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

సత్తెనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగాకాలనీకి చెందిన రాగినూతల కరుణపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితులైన పాలమాను పూర్ణచంద్రరరావు, పల్లపు అంకమరావులను అరెస్టు చేసినట్టు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు ప్రకటించారు. సహజీవనం చేస్తున్న భారతీ అనే మహిళను పూర్ణచంద్రరరావు కొట్టడంతో ఆమె కన్పించకుండా వెళ్లిపోగా ఆమె విషయం తల్లి కరుణమ్మకు తెలుసని పూర్ణచంద్రరావు కత్తితో ఇష్టం వచ్చినట్లు గాయపరిచాడు. ఆ తర్వాత స్నేహితుడైన పల్లపు అంకమరావుతో కలిసి బైక్‌పై పరారయ్యాడు. కేసు విచారణలో నిందితులు ఇద్దర్నీ గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని కరుణమ్మ ఫిర్యాదు చేసిందని నిందితులపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. నిందితులను అరెస్టు చేసినపట్టణ ఎస్ఐ సంధ్యారాణిని, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ హనుమంతరావు

వైసీపీకి.. పచ్చధనం

(మొదటి పేజీ తరువాయి)

పచ్చని మొక్కలను భారీగా కొనుగోలు చేయించి కార్యక్రమాల ప్రాంగణాలను అలంకరింపచేసేవారు. ఈ వ్యవహారాల్లో వైసీపీ నేతలు, అధికారులు కలిసి రూ.కోట్ల నిధులు దోచేశారన్న విమర్శలు ఉన్నాయి.

కొన్నారు.. కొట్టేశారు

ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తెనాలి వచ్చినప్పుడు రెండు గంటల కార్యక్రమానికి రూ.3.8 లక్షల విలువైన మొక్కలను మున్సిపాలిటీ కొనుగోలు చేసింది. కార్యక్రమం తర్వాత వాటిని పట్టణంలోని పార్కుల్లో నాటలేదు. 80 శాతం మొక్కలు దగ్గర్లోని నర్సరీలకు అమ్మేశారు. రూ.3.8 లక్షలకు బిల్ చేయించి నేతలు జేబులో వేసుకున్నారు. అంటే కొన్నా, అమ్మినా డబ్బే. కొనడానికి రూ.3.8 లక్షలు ఖర్చయితే, అమ్మిన మొక్కల తాలూకు రూ.2.4 లక్షల వరకు అదనపు ఆదాయం వచ్చినట్లు సమాచారం. ఇది ఒక్క తెనాలిలోనే కాదు. పొన్నూరు, రేపల్లె, బాపట్ల, గుంటూరు కార్పొరేషన్, ఒకటి కాదన్నట్లు అన్ని చోట్లా దోపిడీ తంతే. అయితే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో ఈ దోపిడీకి లెక్కేలేదనేది అధికారుల మాటే. కొన్నట్లు బిల్లులు చూపినా తర్వాత మొక్కలు చూపాలని, అమ్మేస్తే ఎలాగని మున్సిపల్ సిబ్బంది నిలదీసినా పట్టించుకోకుండా వైసీపీ నేతలే కొందరు అమ్మేసుకున్నారని చెబుతున్నారు. తెనాలి, పొన్నూరు వంటి మరికొన్ని మున్సిపాలిటీల్లో పార్కుల నిర్వహణ చూసే ఉద్యాన విభాగంలో పనిచేసే సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది అమ్ముకున్న పరిస్థితి ఉంది.

సుందరీకరణలో చేతివాటం..

పట్టణ, నగర ప్రజలకు కాస్తంత ఆహ్లాదాన్ని పంచేది, యాంత్రిక జీవనంలో జనం సేద తీరేది పార్కుల్లోనే. అలాంటి పార్కుల అభివృద్ధి, పచ్చదనం కోసం ప్రభుత్వం భారీగా వివిధ విభాగాల నుంచి మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తోంది. పట్టణ సుందరీకరణ పేరుతో డివైడర్లపై, పార్కుల్లో మొక్కలు నాటేందుకు ఖరీదైన మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల తెనాలి-విజయవాడ నాలుగు లైన్ల రహదారి మధ్య డివైడర్‌పై మొక్కలు నాటేందుకు రూ.25 లక్షలను మంజూరు చేసే అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది. దీనికి సంబంధించి మొక్కలను కొనుగోలు చేసి రెండు లారీల్లో తెచ్చారు. వాటిలో కొన్నిటిని మాత్రమే పెట్టారు. మిగిలినవాటిలో కొన్నిటిని వాటర్‌వర్క్స్ ప్రదేశంలో పెట్టారు. వీటిలో చేతివాటం ఎంతనేది లెక్కలు చూడాల్సిందే. ఇదే తరహాలో మరికొన్ని మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ నిధులు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీల్లో సుందరీకరణ పేరుతో గత వైసీపీ సర్కారు ఉన్నప్పుడు రూ.68 లక్షలు కేటాయించి, వాటిలో ఎన్ని మొక్కలు తెచ్చారో! ఎన్ని నాటారో కూడా లెక్కలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తెనాలి వంటి కొన్ని మున్సిపాలిటీల్లో ఇంకా వైసీపీకి చెందిన కిందిస్థాయి నాయకులే మున్సిపల్ పనుల్లో, మొక్కల కాంట్రాక్ట్‌ల్లో చక్రం తిప్పుతూ నిధులు దోచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



పల్లెల్లో పండుగ

- జోరుగా శంకుస్థాపనలు
- గ్రామాల్లో సందడిగా కార్యక్రమాలు
- పాల్గొంటున్న టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు

ఒంగోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమం జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నది. గ్రామాల్లో ఉపాధి పథకం నిధుల కింద మంజూరైన సిమెంట్‌రోడ్లు, కాలువలు, ఇతర పనులకు జోరుగా శంకుస్థాపనలు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో సందడి, స ందడిగా ఈ కార్యక్రమం సాగుతుండగా తమ పరిధిలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పాల్గొంటున్నారు. అలాంటి చోట్ల మరింత సందడిగా పల్లెపండుగ కార్యక్రమం సాగుతున్నది. జిల్లాలో గురువారం పరిశీలిస్తే.. ఒంగోలు రూరల్ మండలంలోని యరజర్ల, సర్వేరెడ్డిపాలెం గ్రామాల్లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడులో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. వీసీపల్లిమండలంలోని గ్రామాల్లో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొనగా, పొదిలి, తర్లుపాడు మండలాల్లోని గ్రామాల్లో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు యర్రగొండపాలెం మండలంలో పాల్గొనగా, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాల్లో పాల్గొన్నారు. ఇతర చోట్ల స్థానిక టీడీపీ నేతలు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శంకుస్థాపనలు నిర్వహిస్తున్నారు. కాగా శుక్రవారం టీడీపీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశానికి ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. దీంతో జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎవరూ శుక్రవారం పాల్గొనే అవకాశం లేదు.

జిల్లాలో చెడ్డీ గ్యాంగ్‌లు!

- అనుమానంతో అప్రమత్తమైన పోలీసులు
- ఒంగోలులో నాలుగు ప్రాంతాల్లో దొంగతనాలు
- చీమకుర్తిలో ఏటీఎంలో చోరీకి యత్నం

ఒంగోలు క్రైం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి చెడ్డీగ్యాంగ్‌లు ప్రవేశించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అప్రమత్తం చేశారు. బుధవారం రాత్రి ఒంగోలులో నాలుగు ప్రాంతాల్లో దొంగతనాలు జరగడం, చీమకుర్తిలో ఏటీఎం చోరీకి విఫలయత్నం చేయడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. అదేవిధంగా రావ్ అండ్ నాయుడు కాలేజీలో సీసీ ఫుటేజి ఆధారంగా చెడ్డీగ్యాంగ్ అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఎస్పీ అప్రమత్తమై జిల్లాలో గస్తీ పెంచారు. అంతేకాకుండా ఆయుధాలతో గస్తీ తిరిగే విధంగా ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరంలో 50 బృందాలను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ఒంగోలు నగరంలో ప్రత్యేక బృందాలు సిద్ధమయ్యాయి. అదేక్రమంలో అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో లాడ్జీలలో తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్‌లను తీస్తున్నారు. ఒంగోలులో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి.



మృతిచెందిన తిరుపతమ్మ పక్కన మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

ఊళ్లపాలెంలో దారుణం

- భార్యను హతమార్చిన భర్త
- మద్యం మైకంలో దాడి ● అడ్డుకున్న గృహిణి
- అందుకు ఆగ్రహించి కత్తితో ఆమె గొంతులో పొడిచిన వైనం
- ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి

సింగరాయకొండ, అక్టోబరు 17 : మద్యం మైకంలో భార్యతో ఘర్షణ పడి ఆమెపై దాడి చేశాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక రక్షణ చర్యల్లో భాగంగా భార్య కర్ర తీసుకుని భర్త తలపై కొట్టింది. మత్తులో ఉన్న భర్త కోపోద్రిక్తుడై పక్కనే ఉన్న కత్తితో భార్య గొంతులో విచాక్షణారహితంగా పొడిచాడు. దీంతో ఆమె ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దారుణ సంఘటన గురువారం రాత్రి మండలంలోని ఊళ్లపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఊళ్లపాలేనికి చెందిన పుట్టా వెంకట్రావు సింగరాయకొండలో ఒక కూరగాయల దుకాణంలో పనిచేస్తుంటాడు. తరచూ మద్యం సేవించి వచ్చి భార్యతో ఘర్షణకు దిగుతుంటాడు. ఎప్పుడు మాదిరిగానే గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. రాగానే భార్య తిరుపతమ్మ(24)తో ఘర్షణకు దిగాడు. మద్యం మత్తులో ఆమెపై దాడిచేశాడు. రక్షణ కోసం భార్య కర్రతో వెంకట్రావు తలపై కొట్టింది. దీనికి ఆగ్రహం చెందిన భర్త పక్కనే ఉన్న కత్తి తీసుకుని తిరుపతమ్మ గొంతులో పొడిచాడు. రక్తస్రావం ఎక్కువ కావడంతో ఆమె అక్కడే కుప్పకూలింది. కుటుంబ సభ్యులు గమనించి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై బి. మహేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌పై కేసు నమోదు

- పొదిలి జూనియర్ సివిల్‌కోర్టు తీర్పు
- మరో ఐదుగురిని నిందితులుగా చేర్చాలని ఆదేశం

పొదిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకరి భూమి మరొకరికి దక్కేలా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించిన అధికారులపై కేసు నమోదు చేయాలని పొదిలి జూనిర్ సివిల్‌కోర్టు తీర్పు నిచ్చింది. ఆ మేరకు తీర్పు ఉత్తర్వులను స్థానిక పోలీసు స్టేషన్‌కు పంపించింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో విశ్వనాథశాస్త్రీ సొసైటీకి చెందిన సర్వే నంబరు 212, 213లో 15 సెంట్ల భూమి ఉంది. దీనిలో ఇంచుమించు 3 సెంట్ల భూమి వివాదంలో ఉంది. సదరు భూమి వెలిశెట్టి వెంకటేశ్వర్లు, అనే వ్యక్తి టి.ఏడుకొండలు, వెంకట్రావుల వద్ద కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకొన్నాడు. సదరు భూమికి గతంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసిన తహసీల్దార్ దేవప్రసాద్, సర్వేయర్ డి.బ్రహ్మం, వీఆర్వో యాకోబులు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఆ పత్రాల ఆధారంగా బెల్లం పద్మజ అనే మహిళ 2022లో వి.రాజ్యలక్ష్మి, టి.వరలక్ష్మిలకు విక్రయించారు దీనిపై వెలాశెట్టి వెంకటేశ్వర్లు తన వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. బుధవారం కోర్టు ఆదేశాలతో అప్పటి తహసీల్దార్ దేవప్రసాద్, సర్వేయర్ డి.బ్రహ్మం, వీఆర్వో యాకోబు తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన బెల్లం పద్మజ, కొనుగోలు చేసిన వి.వరలక్ష్మి, డి.రాజ్యలక్ష్మిలపై కేసు నమోదు చేశారు. అధికారులు జారీ చేసిన తప్పుడు ధ్రువపత్రాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

టెట్ పరీక్షకు 670 మంది హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష(టెట్)కు గురువారం 670 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాలకు గాను ఒంగోలులోని ఎన్‌సీసీఎస్‌ఐ కేంద్రం, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్, మార్కాపురంలోని కృష్ణచైతన్య ఇంజనీరింగ్‌కళాశాలలో పరీక్ష నిర్వహించారు. పరీక్షకు మొత్తం 791 మంది అభ్యర్థులను కేటాయించగా 670 మంది హాజరు కాగా 121 మంది గైర్హాజరయ్యారు.

అర్హులందరికీ కొత్త పింఛన్‌లు

- దీపావళి నుంచి ఉచిత గ్యాస్
- మంత్రి రవికుమార్
- ఎలాంటి ఆర్భాటాలు వద్దు
- వేదిక నుంచి కిందికి దిగి వచ్చి అర్జీలు స్వీకరించిన వైనం



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మం త్రి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): త్వరలో అర్హులైన వారందరికీ పింఛన్‌లు మంజూరు చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలంలోని మోదేపల్లిలో పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రికి స్వాగతం పలికే సందర్భంలో ఎలాంటి ఆర్భాటాలు వద్దు.. ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకునేలా ఉం డాలి, అలా కాకుండా డీజే సౌండ్‌లు, బాణసంచాలతో ఊరేగింపుగా వస్తే ఏమిటి ప్రయోజనమని నాయకులను, అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇక నుంచి ఎక్కడ కార్యక్రమాలకు హాజరైనా హంగామా చేయవద్దని కోరారు. రోడ్డు మీదుగా నడిచి వస్తుంటే ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకునే విధంగా ఉండాలన్నారు. స్టేజిని ఏర్పాటు చేసి పైన కూర్చుంటే ప్రజలు వచ్చి అర్జీలు ఎలా ఇస్తారన్నారు. వెంటనే స్టేజిపై నుంచి దిగి ప్రజల తో కూర్చొని గొట్టిపాటి అర్జీలను స్వీకరించారు. దివ్యాంగుడు నర్రా కర్ణయ్య పూర్తి అంధుడైనప్పటికీ వైసీపీ పాలనలో సాంకేతిక కారణాలతో పింఛన్ తొలగించిన విషయాన్ని మంత్రికి తెలిపారు. త్వరలో అర్హులందరికీ కొత్త పింఛన్‌లు మంజూరు చేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకొని బిల్లులు పొందని లబ్ధిదారులకు త్వరలో డబ్బులు వస్తాయన్నారు. తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డు మరమ్మతులకు రూ.70లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలులోకి వస్తుంద న్నారు. వైసీపీ పాలనలో ఆరోగ్యశ్రీ అటకెక్కిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని వారు గాలికొదిలేశారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెల్లింపులు జరగలేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే ఇద్దరు చిన్నారుల ఆరోగ్యం కోసం రూ.15లక్షలు మంజూరు చేశామన్నారు. మరికొందరికి సీఎం సహాయం అందిందన్నారు. తాళ్లూరు వైపు నుంచి వెళ్లే శ్రీశైలం, విజయవాడ బస్సులను మోదేపల్లి మీదుగా నడపాలని మం త్రిని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఏఈలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, సర్పంచ్ అంజనాయి, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, జొన్నలగడ్డ గోపి, భీమని శ్రీనివాసరావు, నర్రా వీరయ్య, ఏపీవో గాయత్రి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జార్లపాలెం, తిమ్మాయపాలెం, గోపాలపురంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, ఇత ర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

బల్లికురవ : గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం పల్లె పండగ వారోత్సవాలను నిర్వహిస్తుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మండలంలోని ముక్తేశ్వరం, వైదన, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో గురువారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు గోకులం షెడ్లకు భూమి పూజ కార్యక్రమాలు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో గో మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతు గ్రామాలలో అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రోడ్లలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ శ్రీలక్ష్మీ, పీఆర్ ఏఈ మాధవ్ గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. బయటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాల్లో పల్లెపండుగలో భాగంగా సీసీ రోడ్డు పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవో కే సుమంత్, హౌసింగ్ ఏఈ కిషోర్, ఏపీవో సంతోషం, ఈసీ మురళి, సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ అశోక్, సుబ్బారావు, శ్రీకాంత్, శివరాజు, కృష్ణంరాజు, కార్యదర్శులు శిరీష, ఖాన్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు నూతన వైభవం రానుందని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ అన్నారు. నూతలపాడు, నాగులపాలెం, రమణాయపాలెం, చింతగుంటపాలెం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్టూరు : సీసీ రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు కోరారు. బొల్లాపల్లిలో రూ.30 లక్షలతో 3, తాటివారిపాలెంలో రూ.20లక్షలతో 1 సీసీ రోడ్డు, కోలలపూడిలో రూ.15లక్షలతో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

చినగంజాం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని మోటుపల్లి గ్రామ సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు అన్నారు. పల్లె పండుగలో భాగంగా మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి నిధులు రూ.85.50లక్షలతో నిర్మించే సీసీ, గ్రావెల్ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, ఈవోపీఆర్డీ సుబ్బారావు, పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రుడు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి



ఎమ్మెల్యే ఏలూరికి సమస్యలు విన్నవిస్తున్న మహిళ

పర్చూరు : ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం పర్చూరు నియోజవకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఉదయం ఇసుకదర్శిలోని క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను వింటూ పరిష్కారానికి అధికారులతో ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు ఏలూరిని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం వరపర్ల, రామ్‌కూర్, ఇంజనంపాడు, పమిపాడు, జన్నతాళి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని, దీనికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయన్నారు. ప్రజా కూటమి వచ్చాక గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. త్వరలో అర్హులందరికీ పింఛన్‌లు, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం అందజేస్తామన్నారు. రైతులకు సాగునీరు, ఎరువులు అందేలా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.



ఈపూరుపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధిలో ముందుందాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : అభివృద్ధిలో ముందుండి, ఆదర్శంగా నిలుద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం మండల పరిధిలోని ఈపురుపాలెంలో రూ.30లక్షలు, గవినివారిపాలెంలో రూ.23లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అందిస్తున్న చేయూతను వివరించారు. వైసీపీ పాలనలో కుంటుపడిన అన్ని వ్యవస్థలకూ తిరిగి జీవం పోస్తున్నారన్నారు. అనంతరం స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చా రు. అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నా యకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి

- అన్నదాతకు నష్టం
- పొంగిన వాగులతో జనజీవనం అస్తవ్యస్తం



నీలాయపాలెం ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలు

చినగంజాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. పలు ప్రాంతాలలో వేసిన వరి పంట గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటమునిగింది. నీలాయపాలెం ప్రాంతంలో 400 ఎకరాలలో వేసిన వరి నాగన్న వాగు, పై ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటిలోనే ఉన్నాయి. 20రోజుల కిందట ఎకరానికి రూ.20వేలు ఖర్చుతో వేసిన వరి నాట్లు వర్షార్పణం అయ్యాయని రైతులు తూమాటి ఆంజనేయులు, సాధినేని అమరయ్య, వేణుగోపాలరావు, సుబ్బారావు, ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. కొమ్మమూరు కాలువ పరిదిలోని గొనసపూడి, కడవకుదురు ప్రాంతాల్లో నారుమళ్లు భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. నీలాయపాలెం సమీపంలోని నాగన్న వాగు ఉధృతి తగ్గలేదని సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయినట్లు చెప్పారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు జలదిగ్బంధంలోనే ఉన్నారు. గ్రామానికి చుట్టుపక్కల ఉన్న బకింగ్ హామ్ కెనాల్, వాద సప్పా, చిన్నఏరుల వరదకు రాకపోకలు స్తంభించాయి. శుక్రవారం నాటికి కొంత మేర వరద ఉధృతి తగ్గవచ్చునని గ్రామస్థులు అంటున్నారు. ఉప్పుగుండూరు, నీలాయపాలెం గ్రామాల మధ్య నాగన్నవాగు వద్ద, పెదగంజాం సమీపంలోని చిన్నఏరు వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎస్ఐ శీలం రమేష్ పోలీసు పికెట్‌ని ఏర్పాటు చేశారు. మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీలోని లోతట్టు ప్రాంతాల ఇళ్లల్లోకి వాన నీరు చేరింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.



భగవాన్‌రాజుపాలెంలో భవనంపై ఉన్న నీటి ట్యాంక్‌పై పిడుగు పడి ముక్కలైన ఇనుప మూత (ఇన్‌సెట్లో) ధ్వంసమైన మెట్లు

భవనంపై పడిన పిడుగు

- భయకంపితులైన ప్రజలు
- రూ.లక్షల్లో నష్టం
- భగవాన్‌రాజుపాలెంలో ఘటన

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో భవనంపై పిడుగు పడింది. ఈ ఘటన బుధవారం ఉదయం 7.30గంటల సమయంలో జరిగింది. పిడుగు భవనంపై ఉన్న నీటి ట్యాంక్‌లో పడడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికీ, దాని ధాటికి నివాస గృహంలో ఉన్న దంపతులతో పాటు సమీప ప్రజలు భయకంపితులయ్యారు. నీళ్ల ట్యాంక్‌పై పటిష్టంగా నిర్మించి ఇనుప మూత ముక్కలై చెల్లాచెదురుగా పడిపోగా, ట్యాంక్‌పైకి ఎక్కేందుకు నిర్మితమైన కొన్ని మెట్లు ఛిద్రమయ్యాయి. ఇంట్లో ఉన్న రూ.30 వేల విలువ చేసే ఇన్‌వర్టర్‌తో పాటు నాలుగు ఫ్యానులు, నాలుగు సీసీ కెమేరాలతో పాటు ప్యానల్ బోర్డ్ కాలిపోయి లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని ఇంటి యజమాని జాగర్లమూడి వెంకటరావు తెలిపారు. పిడుగుపాటుకు సమీప ఇళ్లల్లో మూడు ఇన్‌వర్టర్లు, అధిక సంఖ్యలో ఫ్యాన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు మాడిపోయాయని ప్రజలు తెలిపారు.

ఎమ్మెల్యే ఏలూరి నివాళి

మేదరమెట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఈఈ జాగర్లమూడి హరేరామకృష్ణ మృతి పట్ల పర్చూరు ఎమ్మె ల్యే ఏలూరి సాంబశివరావు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గురువారం ఆయన పమిడిపాడు చేరుకుని రామకృష్ణ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఈ ఘటన తీవ్ర విచారకరమన్నారు. నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని తెలిపారు. బుధవారం చిన్నగంజాంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో సైతం ఈఈ పాల్గొన్నారని పేర్కొన్నారు.

రేపు వాలీబాల్ బాల, బాలికల జట్లు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన అండర్‌-17 బాల, బాలికల వాలీబాల్ ఉమ్మడి జిల్లా జట్లు ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి సెక్రటరీ ఎండీ.హజీరాబేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు త్రోవగుంట హైస్కూలులో నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు హాజరుకావాలని, ఆయా ప్రభుత్వ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు ఫారం-బితో వారిని పంపించాలని ఆమె కోరారు.

25 వరకు గడువు పెంపు

ఒంగోలు విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్‌స్కూలు సొసైటీలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్ల గడువును ప్రభుత్వం ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 28నుంచి 29 వరకు, రూ.1000 రుసుంతో ఈనెల 30,31 తేదీల వరకు అడ్మిషన్లకు అవకాశం ఇచ్చారన్నారు.

వైసీపీకి.. పచ్చ‘ధనం’

- జగన్ సభలకు మొక్కల పేరిట దోపిడీ
- చెట్లు కొట్టినా.. మొక్కలు కొన్నా కాసులే కాసులు
- వైసీపీ నేతలు, మున్సిపల్ సిబ్బంది కుమ్మక్కు
- పట్టణాల సుందరీకరణ మొక్కలూ అమ్మకాలు
- కూటమి ప్రభుత్వంలోనూ మున్సిపాల్టీల్లో అక్రమాలు
- పట్టణ పార్కుల్లో నాటాల్సిన మొక్కలు కూడా మాయం

(5వ పేజీ తరువాయి)

పచ్చని మొక్కలను భారీగా కొనుగోలు చేయించి కార్యక్రమాల ప్రాంగణాలను అలంకరింపచేసేవారు. ఈ వ్యవహారాల్లో వైసీపీ నేతలు, అధికారులు కలిసి రూ.కోట్ల నిధులు దోచేశారన్న విమర్శలు ఉన్నాయి.

కొన్నారు.. కొట్టేశారు

ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తెనాలి వచ్చినప్పుడు రెండు గంటల కార్యక్రమానికి రూ.3.8 లక్షల విలువైన మొక్కలను మున్సిపాలిటీ కొనుగోలు చేసింది. కార్యక్రమం తర్వాత వాటిని పట్టణంలోని పార్కుల్లో నాటలేదు. 80 శాతం మొక్కలు దగ్గర్లోని నర్సరీలకు అమ్మేశారు. రూ.3.8 లక్షలకు బిల్ చేయించి నేతలు జేబులో వేసుకున్నారు. అంటే కొన్నా, అమ్మినా డబ్బే. కొనడానికి రూ.3.8 లక్షలు ఖర్చయితే, అమ్మిన మొక్కల తాలూకు రూ.2.4 లక్షల వరకు అదనపు ఆదాయం వచ్చినట్లు సమాచారం.

ఇది ఒక్క తెనాలిలోనే కాదు. పొన్నూరు, రేపల్లె, బాపట్ల, గుంటూరు కార్పొరేషన్, ఒకటి కాదన్నట్లు అన్ని చోట్లా దోపిడీ తంతే. అయితే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో ఈ దోపిడీకి లెక్కేలేదనేది అధికారుల మాటే. కొన్నట్లు బిల్లులు చూపినా తర్వాత మొక్కలు చూపాలని, అమ్మేస్తే ఎలాగని మున్సిపల్ సిబ్బంది నిలదీసినా పట్టించుకోకుండా వైసీపీ నేతలే కొందరు అమ్మేసుకున్నారని చెబుతున్నారు. తెనాలి, పొన్నూరు వంటి మరికొన్ని మున్సిపాలిటీల్లో పార్కుల నిర్వహణ చూసే ఉద్యాన విభాగంలో పనిచేసే సూపర్‌వైజర్‌లు, ఇతర సిబ్బంది అమ్ముకున్న పరిస్థితీ ఉంది.

సుందరీకరణలో చేతివాటం..

పట్టణ, నగర ప్రజలకు కాస్తంత ఆహ్లాదాన్ని పంచేది, యాంత్రిక జీవనంలో జనం సేద తీరేది పార్కుల్లోనే. అలాంటి పార్కుల అభివృద్ధి, పచ్చదనం కోసం ప్రభుత్వం భారీగా వివిధ విభాగాల నుంచి మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తోంది. పట్టణ సుందరీకరణ పేరుతో డివైడర్లపై, పార్కుల్లో మొక్కలు నాటేందుకు ఖరీదైన మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల తెనాలి-విజయవాడ నాలుగు లైన్ల రహదారి మధ్య డివైడర్‌పై మొక్కలు నాటేందుకు రూ.25 లక్షలను మంజూరు చేసే అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది. దీనికి సంబంధించి మొక్కలను కొనుగోలు చేసి రెండు లారీల్లో తెచ్చారు. వాటిలో కొన్నిటిని మాత్రమే పెట్టారు. మిగిలినవాటిలో కొన్నిటిని వాటర్‌వర్క్స్ ప్రదేశంలో పెట్టారు. వీటిలో చేతివాటం ఎంతనేది లెక్కలు చూడాల్సిందే.

ఇదే తరహాలో మరికొన్ని మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ నిధులు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీల్లో సుందరీకరణ పేరుతో గత వైసీపీ సర్కారు ఉన్నప్పుడు రూ.68 లక్షలు కేటాయించి, వాటిలో ఎన్ని మొక్కలు తెచ్చారో! ఎన్ని నాటారో కూడా లెక్కలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తెనాలి వంటి కొన్ని మున్సిపాలిటీల్లో ఇంకా వైసీపీకి చెందిన కిందిస్థాయి నాయకులే మున్సిపల్ పనుల్లో, మొక్కల కాంట్రాక్టుల్లో చక్రం తిప్పుతూ నిధులు దోచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- మంత్రి స్వామి హెచ్చరిక
- జీజీహెచ్‌లో సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోపై సీరియస్

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లో వైద్యాధికారుల పనితీరుపై మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సీరియస్ అయ్యారు. గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లతో కలిసి జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి హాజరుకాకపోవడంతో మంత్రి మండిపడ్డారు. ఆ సమయంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నందున తాను రాలేకపోయానని తెలిపారు. అయితే ఆ విషయం తనకు చెప్పి అధికారుల అనుమతి తీసుకోవాలి కదా అని ప్రశ్నించారు. అయితే వీసీల పేరుతో మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు వచ్చినా రాకపోవడంతో నిర్లక్ష్యం తెలుస్తుందని సీరియస్ అయ్యారు. జిల్లా అధికారులు, మంత్రి వస్తేనే పట్టించుకోకుంటే ఇక సామాన్య రోగులకు ఏ విధమైన సేవలు ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. అదేవిధంగా గైనిక్‌వార్డులో దుర్వాసన కొడుతూ అస్తవ్యస్తంగా ఉండటం, ఫ్యానులు పనిచేయకపోవడంపై ఆర్‌ఎంవో డాక్టర్ చెంచయ్యపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలు ఉండే వార్డులో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే సమయంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ పనితీరుపైనా మంత్రి స్వామి అసహనం వ్యక్తం చేశారు. బాలింతల వార్డులో కనీస సౌకర్యాలు, పరిశుభ్రత పాటించకపోవడం మీ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని, పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని సూపరింటెండెంట్, ఆర్‌ఎంవో, నర్సింగ్ సూపరింటెండెంట్‌లను ఆయన హెచ్చరించారు.

సీసీ కెమెరాలు.. నేర నియంత్రణ అస్త్రాలు

» లేని చోట అపరాధ పరిశోధనలో లోపాలు
» అవసరమైన చోట ఏర్పాటు తప్పనిసరి

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతోంది. అపరాధ పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోంది. ఆక్రమంలో ఇచ్ఛాపురం నుంచి తడ వరకు రాష్ట్రంలో ఎక్కడైనాసరే నేరం జరిగినా వెంటనే తెలిసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీసీ కెమెరాలు డీజీపీ కార్యాలయానికి అనుసంధానం చేస్తారు. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరం జరిగినా నేరస్థులు ఎక్కడో ఒక చోట సీసీలరే చిక్కుతారు. దీంతో అపరాధ పరిశోధన వేగవంతం అవుతుంది. ఈ క్రమంలో చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 195 ప్రాంతాల్లో 540 సీసీ కెమెరాలు ప్రస్తుతం ఉన్నాయి. మరో 50 ప్రాంతాలను గుర్తించి అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. అదే విధంగా చీరాల టూటౌన్, రూరల్ సర్కిల్ పరిధిలో కూడా సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసే విధంగా ఉన్నతాధికారులు తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. ఇప్పటికి ఉన్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా ఏఏ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలో గుర్తిస్తున్నారు. తరువాత పూర్తి స్థాయిలో అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. దీంతో నేరనియంత్రణకు, నేరంకు పాల్పడిన వారిని వెంటనే పట్టుకునేందుకు మార్గం సుగమం అవుతుందని పోలీస్‌శాఖ భావిస్తోంది.



మార్కెట్ సెంటర్లోని సీసీ కెమెరాలు

ఉన్న చోట సత్ఫలితాలు

నేరాలు జరిగిన ప్రదేశంలో అపరాధ పరిశోధనకు పోలీసులకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. పట్టణంలో గతంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గడియార స్తంభానికి కూతవేటు దూరంలో జరిగిన దొంగతనం కేసులో సీసీ కెమారాలలో రికార్డయిన నిందితుని చిత్రాలు ఆధారంగా త్వరితగతిన పట్టుకున్నారు. చోరీ సొత్తును రికవరీ చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాడరేవు జంక్షన్ వద్ద జరిగిన ఓ రోడ్డు యాక్సిడెంట్‌కు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు దొరికాడు. రూరల్ పరిధిలో చీరాల మండలం ఈపురుపాలెంలో జరిగిన ఓ వృద్ధురాలి హ్యతకు సంబంధించి సీసీ కెమెరాలు ఆ ప్రాంతంలో లేకపోవటంతో విచారణ మందకొడిగా సాగింది. ఇటీవల చీరాల కారంచేడుగేటు సెంటర్ ప్రాంతంలో జరిగిన ఏ వృద్ధురాలి హత్యకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు వారు ఉపయోగించిన కారు సీసీ టీవీలకు చిక్కడంతో నిందితులను పట్టుకుని కేసును వేగవంతంగా ఛేదించారు. తాజాగా వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను చీరాల మండలం వాడరేవు రోడ్డులో నగరవనం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వాడరేవు, పిడుగురాళ్ల జాతీయ రహదారికి సంబంధించి నిర్మిస్తున్న కల్వర్టులో పడి చనిపోయి ఉండగా గమనించినవారు పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రాథమికంగా పోలీసులు ఆ ఘటన యాక్సిడెంట్‌గా నిర్ధారించారు. అయితే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, ఇతరులు ఆ ఘటనకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్న కెమెరా సరైన రీతిలో ఉండకపోవడంతో పోలీస్ దార్యప్తునకు సరైన ఆధారం దొరకడం లేదని పోలీసు వర్గాలు చెప్తున్నట్లు సమాచారం. ఆ ప్రాంతానికి సమీపంలో ఓ రెస్టారెంట్ ఉంది. సమీపంలో నగరవనం ఉంది. వీటిలో ఏ ఒక్క చోట సీసీఎ కెమెరా ఉన్నా పోలీస్ విచారణకు ఆధారం దొరికేది. మొత్తమ్మీద సీసీ కెమరాలు, నేర నియంత్రణ అస్త్రాలు అనడంలో ఎలాంటి సందేహం లేదు.


బూదవాడలో దెబ్బతిన్న మినుమును పరిశీలిస్తున్న ఏవో

వర్షాలకు దెబ్బతిన్న మినుము

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఐదు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలకు కోతదశలో ఉన్న మినుము పంటకు నష్టం ఉంటుందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. బూదవాడలో వర్షానికి దెబ్బతిని మొలక వచ్చిన మినుము పైరును ఏవో సుబ్బారెడ్డి గురువారం రైతలతో కలసి పరిశీలించారు. మండలంలో 3458 ఎకరాల విస్తీర్ణంలో మినుము సాగు చేసినట్లు ఏవో తెలిపారు. వర్షాలతో మొలకను గుర్తించినట్లు చెప్పారు. సాగులో ఉన్న మినుము పైరు సుమారు 2వేల ఎకరాలు కోతదశకు చేరినట్లు తెలిపారు.

రెండు వాహనాలు ఢీ
తప్పిన ప్రమాదం

మార్టూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన గురువారం వేకువజామున ఒంగోలు వైపు వెళ్లే రోడ్‌లో రాజుపాలెం కూడలి సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలకు చెందిన డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రాంచీ నుంచి బెంగళూరు వెళుతున్న మినీ వ్యాను మార్టూరు వైపు వస్తుండగా, మార్టూరు వైపు నుంచి రాంగ్ రూట్‌లో రెస్ట్ ఏరియాకు వెళుతున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లు క్షేమంగా బయటపడగా, వారిద్దరి వాహనాలు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలియగానే హైవే మొబైల్ వాహనం ఘటనా స్థలానికి వచ్చి, వాహనాలను రోడ్డు నుంచి పక్కకు తీసి, ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చేశారు.

రోటరీ భవనానికి స్థలం మంజూరు చేయాలని వినతి

మార్టూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోటరీ భవన నిర్మాణానికి మార్టూరులో స్థలం కేటాయించాలని గురువారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో రోటరీ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కోరారు. ఈ సందర్భంగా మార్టూరు రోటరీ క్లబ్ వారు చేసిన సేవా కార్యక్రమాలను సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇటీవల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాష్టి వెంకటమోహనరావు, చెరుకూరి అంజిబాబు, మాదాల సాంబశివరావు, శానంపూడి లక్ష్మయ్య, కొత్రపాటి కాజారావు, చెరుకూరి నాగేశ్వరరావు, కళ్లేపల్లి శ్రీనివాసరాజు, సాయి శ్రీనివాసరావు, షేక్ కాజాహుస్సేన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరిని నూతనంగా బాధ్యతలు చేట్టిన ఎంపీడీవో జి.శ్రీనివాసరావు ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండండి

చీరాలటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జోరుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ప్రజలు, వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. తడిసిన విద్యుత్ స్తంభాలు, మోటార్లు, తెగిన విద్యుత్ తీగలను తాకవద్దని తెలిపారు. అలాగే విద్యుత్ పోల్స్ వద్ద తేమగా ఉన్న ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు సైతం వినియోగించరాదన్నారు. ప్రమాదాలు గుర్తించినట్లయితే స్థానికంగా ఉన్న అధికారులకు సమాచారాన్ని అందించాలని కోరారు.

సభ్యత్వ నమోదులో సమష్టిగా పనిచేద్దాం

ఎమ్మెల్యే కొండయ్య పిలుపు

కొత్తపేట(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సంబంధీకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. టీడీపీ కార్యాలయంలో గురువారం నియోజవర్గ పరిధిలో క్లస్టర్లు, బూత్ ఇన్‌చార్జులు, రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల స్థాయి బాధ్యులతో సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొండయ్య మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు సంబంధించి అధిష్ఠానం సూచించిన విధంగా క్షేత్ర స్థాయిలో బాధ్యులు పనిచేయాలన్నారు. మిగిలిన శ్రేణులందరూ వారికి సహకరించాలన్నారు. సందేహాలను నివృత్తి చేశారు. సత్ఫలితాలు తీసుకొచ్చి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు సమిష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, బాధ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

8 మందికి సీఎం సహాయం చెక్కుల అందజేత

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సలు చేయించుకున్న 8 మందికి రూ.9,15,344 చెక్కులను మంత్రి రవికుమార్ గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన సురేష్‌కు రూ.6,05,000, కొమ్మినేనివారిపాలెంకు చెందిన మక్కెన నికితకు రూ.90వేలు, నాగులపాడుకు చెందిన కరి వెంకటేశ్వర్లుకు రూ.27,493, కోటపాడుకు చెందిన తలకండపాటి అంనంతలక్ష్మికి రూ.20,800, బొడ్డువానిపాలెంకు చెందిన సిద్దంశెట్టి నాగరాజకుమారికి రూ.35,655, కొరిశపాడుకు చెందిన కాటూరి సాయికి రూ.20వేలు, పంగులూరుకు చెందిన పి.శాంతమ్మకు రూ.80,597 చెక్కులను అందజేశారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

వేటపాలెం (చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణం వద్దని స్థానికులు గురువారం ఆందోళనకు దిగారు. వేటపాలెం నుంచి జాతీయ రహదారి వైపు వెళ్లే దారిలో పెదబజారు సెంటర్‌లోని ముస్లిం లోకాలటీ వద్ద కొందరు మద్యం దుకాణం ఏర్పాటును వద్దంటూ నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ శేషగిరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటి వరకు అక్కడ మద్యం దుకాణాన్ని నిర్వహించరని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇదే విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తీసుకువెళ్లారు.


ఆందోళనతో స్తంభించిన ట్రాఫిక్

చీరాలటౌన్ : ఇళ్ల మధ్యలో స్కూల్ వెంబడి మద్యం షాపు వద్దంటూ చీరాల మునిసిపల్ పరిధిలోని గంజిపాలెంలో ప్రజలు ఆందోళనకు దిగారు. ఎక్సైజ్ శాఖ నిర్వహించిన లాటరీలో షాపును దక్కించుకున్న నిర్వాహకులు ఆ రోడ్డులో దుకాణాన్ని ప్రారంభించారు. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. అయితే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్ది చెప్పారు. సమస్యలు ఉంటే రాత పూర్వకంగా వివరించాలని సూచించారు. దీంతో సమస్య తాత్కాలికంగా వాయిదా పడింది. ఈక్రమంలో చాలాసేపు ట్రాఫిక్ స్తంభించింది.

నేడు అంబడిపూడికి మంత్రి రవికుమార్

బల్లికురవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడిలో శుక్రవారం ఉదయం 8 గంటలకు జరిగే పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఇంకొల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు సబ్‌స్టేషన్‌లో 100కేవీ ట్రాన్స్‌పార్మర్‌లు 10 ఇంటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని విద్యుత్ శాఖ డీఈ థామస్ తెలిపారు. శీతల గిడ్డంగులు, ఆటోనగర్‌లో వ్యవసాయ పరికరాలు తయారు చేసే వర్క్‌షాపులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండడంతో విద్యుత్ వాడకం పెరిగిందన్నారు. ఈ క్రమంలో లోవోల్టేజీ సమస్య తలెత్తుతుందని డీఈ తెలిపారు. సమస్యను పరిష్కరించేందకు కొత్తగా 10 ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని అనుమతులు రగానే పనులు చేపడతామన్నారు. మండలంలోని కొణికిలో మరో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఆగిన చేపల దొంగల వేట

ఇంకొల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుద్దుకూరులో పగలు సైతం దేవదాయ శాఖకు చెందిన ఊరచెరువులో చేపలు పట్టుకొని అమ్ముకుంటున్నట్లు గురువారం ఆంధ్రజ్యోతిలో చేపల దొంగల పంట పండింది అనే కథనం ప్రచురితమైంది. దీంతో అక్రమంగా చేపల వేటకు పాల్పడుతున్న వారు అప్రమత్తమయ్యారు. రెండు రోజులుగా గ్రామంలో చేపల వేటతో హల్‌చల్ చేసిన వారు గురువారం కనిపించలేదు. బుధవారం వరకు 4 కేజీల నుంచి 10 కేజీల బరువున్న చేపలను అమ్మి వేలకువేలు సొమ్ము చేసుకున్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. నిత్య పూజల అనంతరం వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకుల పూజను నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

22 నుంచి రెవెన్యూ సదస్సులు

బల్లికురవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో పలు గ్రామాలలో జరిగిన రీ-సర్వే లోపాలను సరి చేసేందుకు 22 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ కే రవికుమార్ తెలిపారు. రీసర్వేలో ఏవైనా ఇబ్బందులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.